Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 02.11.2018, శుక్రవారం    సంపుటి : 38 సంచిక : 22    పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి    సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

### ఇది ఖచ్చితంగా...

# గొంతు కోసే ప్రయత్నమే!

- జగన్ కేసులో వెలుగు చూస్తున్న కుట్ర కోణాలు
- అడుగడుగునా అనుమానాలు రేకెత్తిస్తున్న సంఘటనలు
- జగన్‌పై దాడి వెనుక అదృశ్యశక్తులెవరో ?
- బాధ్యతలను మరచి ఎదురుదాడికి పాల్పడుతున్న ప్రభుత్వం

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై. యస్. జగన్మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోంది.

(మిగతా 10వ పేజీలో)

## పిలిస్తే పలుకుతానంటున్న రస్తోగి

10లో



నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఐశ్వర్య రస్తోగి




## ప్రభాకరుడు ఇక సేవాభూషణుడు

11లో




### కస్తూరిదేవి విద్యాలయం వ్యవహారంలో...

# దొంగలెవరు... దొరలెవరు...?

3లో



# ఎదిగే కొద్దీ.. ఒదుగుతున్న వెంకయ్య

**174 మంది అతిథులు, 30గంటల సమయం. రెండు రోజుల విడిది. అన్నింటిని మించి ఉపరాష్ట్రపతి నివాసం, భద్రతా నియమనిబంధనలు, వీటన్నింటికీ అతీతంగా జరిగిన అద్వితీయ ఆత్మీయ కలయిక. 'అపురూప సంగమం' వేదికగా నాయుడు గారి కుటుంబం అందించిన అత్యద్భుత ఆతిథ్యం. ఇది మరువలేని సంఘటన, మరపురాని మధుర ఘటన. ఎప్పుడూ ఎవ్వరూ కలలోనైనా ఊహించని అరుదైన ఆప్యాయతానురాగాల సంబరం.**



## అపురూప 'సంగమం'తో నాయుడు గారి కుటుంబం ఆత్మీయతని పంచింది



కొత్త ఢిల్లీ, మౌలానా ఆజాద్ రోడ్‌లోని నెం.6లో గల ఉపరాష్ట్రపతి నివాసం అక్టోబర్ 27వ తేదీ ఉదయం నుండి ముస్తాబైయ్యింది. రెండురోజుల పాటు ఆ ఇంట జరిగే ఆనంద పండుగ కోసం, నాయుడు గారి కుటుంబం చేసుకున్న శుభ వేడుక కోసం వేదికగా మారింది.

భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తన సుదీర్ఘప్రస్థానంలో తనతో పాటు నడిచిన చిన్ననాటి మిత్రులను, ఆప్తులను, ఆత్మీయులను, శ్రేయోభిలాషులను కలుసుకుని తన చిన్ననాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను పంచుకోవడానికి రూపొందించిన కార్యక్రమమే 'సంగమం'. 2018 జూన్‌లో తొలి 'సంగమం' నిర్వహించి, రెండవ సంగమం కార్యక్రమాన్ని అక్టోబర్ 27, 28వ తేదీలలో నిర్వహించారు.

27వతేదీ మధ్యాహ్నం 12గంటలకు మొదలైన రెండవ ఆత్మీయ సంగమానికి నెల్లూరు, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం నగరాలతో పాటు రెండు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుండి 174 మంది నాయుడు గారి ఆత్మీయులు హాజరయ్యారు. వీరిలో చిన్న పెద్ద అన్న తేడా లేకుండా దేశ స్థాయి ప్రముఖులు, రాష్ట్ర స్థాయి ప్రముఖులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, నాయుడు గారి చిన్ననాటి మిత్రులు వున్నారు.



27వ తేదీ మధ్యాహ్నం 12గంటల నుండి ప్రారంభమైన ఈ సంగమ సంబరానికి నాయుడు గారి కుమార్తె దీపమ్మ స్వాగతం పలికారు. దశాబ్దాల తమ నాన్న గారి ప్రస్థానంలో తోడుగా నీడగా నిలచిన వారందరినీ ఒక్కసారే పిలవడం కష్టతరం కాబట్టి ఇలా రెండుసార్లుగా ఏర్పాటు చేసామని చెప్తూ మా నాన్నగారు ఈ స్థాయికి రావడానికి ఆయన స్వయంకృషితో పాటు ఆయన సహచరులు మిత్రుల సహకారం ఎంతో వుందని గుర్తుచేసుకుంటుంటారని అన్నారు. మధ్యాహ్నం భోజన అనంతరం జరిగిన స్వీయ పరిచయ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ నాయుడు గారితో తమకున్న అనుభవాలను సాన్నిహిత్యాన్ని పంచుకున్నారు.

సాయంత్రం 5గంటలకు తేనీటి విందు అనంతరం నెల్లూరు గాయకుడు ప్రవీణ్‌చే సంగీత సందడిని ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన 'డిన్నర్' కార్యక్రమంలో రాత్రి 10గంటల వరకు నాయుడు గారు, ఉషమ్మలతో పాటు నాయుడు గారి కుటుంబసభ్యులందరూ పాల్గొని అందరికీ కొసరి కొసరి వడ్డించి అన్ని పదార్థాల రుచులను చూపించారు.

రెండవరోజు ఉదయం 8.30 నుండి 9.30వరకు రాజ్యసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'బ్రేక్‌ఫాస్ట్' అనంతరం ఉపరాష్ట్రపతే స్వయంగా రాజ్యసభతో పాటు లోక్‌సభ ప్రాంగణాలకు అందరినీ తీసుకెళ్ళి ప్రతి విషయాన్ని ఆయన స్వయంగా వివరిస్తూ తన పదవి సైతం మర్చిపోయి అత్యంత ఆనందంగా ఉత్సాహంగా అందరితో గడిపారు.

మధ్యాహ్నం వెంకయ్య నివాసంలో జరిగిన ఆత్మీయ కార్యక్రమంలో "మంచి వ్యక్తి – మంచి వక్త" అన్న పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి తన మధురస్మృతులను అందరితో పంచుకున్నారు. 28వ తేదీ మధ్యాహ్నం భోజనం అనంతరం గ్రూప్ ఫోటోలతో సుమారు సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఈ సంగమ సంబరం ముగిసింది.

దీపమ్మ, హర్ష కుటుంబ సభ్యులతో పాటు నాయుడుగారి మనుమడు విష్ణు, మనుమరాలు సుష్మ ఏర్పాటు చేసిన అనేక ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపరాష్ట్రపతి నివాస ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బఠాణీలు, ఉప్పుశనగలు, పప్పుచెక్కలు, పీచుమిఠాయిలతో పాటు అన్ని రోజుల వంటకాలలో వున్న తెలుగు రుచులు మధురమైన స్మృతులను మిగిల్చాయి.

తమ జీవితంలో చూడగలమా అన్న అబ్బురాలను అందరికీ చూపించి, ఈ జన్మకు ఈ తీపి జ్ఞాపకాలు చాలన్నంత ఆనందాన్ని అందరికీ అందించి, వచ్చిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పి వీడ్కోలు తీసుకున్నారు నాయుడు గారి కుటుంబసభ్యులు, నాయుడు గారి సిబ్బంది.

తన స్థాయిని, హోదాని మరచి ఆనాటి ఆపాత జ్ఞాపకాలు మధురాతి మధురం అంటూ అందరినీ 20 నుండి 50యేళ్ళ వెనక్కు తీసుకుపోవడం ఒక్క నాయుడు గారికే చెల్లింది. అందుకే ఆయన 'ఎదిగే కొద్దీ ఒదుగుతున్నారు' అనే మాటలతో పాటు మళ్ళీ రాష్ట్రపతి భవన్‌లో కూడా ఇలాంటి సంగమం జరగాలి అన్న మాట ప్రతి నోటా వినపడింది. నాయుడి గారి కుటుంబానికి శతకోటి వందనాలు తెలుపుతోంది 'లాయర్'.



## హక్కుల కోసం..

# దీక్ష చేసిన 'మాగుంట చందు'



యం.యస్.ఆర్ సేవాసమితి వేదికగా నిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమాలతో నెల్లూరోళ్ళ మదిలో స్థానం సంపాదించుకున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు) ఇప్పుడు రాజకీయపార్టీలకు ఆకర్షణగా మారాడు. 'మన ఊరు మన బాధ్యత' అంటూ అక్టోబర్ 27వ తేదీ శనివారం కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఒక్కరోజు దీక్ష చేశాడు.

పెట్రోల్, డీజిల్‌లతో పాటు వంట గ్యాస్‌లను జిఎస్‌టి పరిధిలోకి తేవాలని, అలాగే తెలుగువారి హక్కుగా కడప ఉక్కు కర్మాగారానికి వెంటనే శంకుస్థాపన చేయించాలని, విశాఖపట్నం రైల్వేజోన్ ద్వారా విశాఖపట్టణాన్ని రైల్వే రవాణా హబ్‌గా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశాడు.

అన్నింటినీ మించి ఆంధ్రప్రదేశ్‌ని అనాధగా చేసి కేంద్ర ప్రభుత్వం "రాజకీయ" డ్రామా ఆడుతుందని, వెంటనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పించి నవ్యాంధ్ర పురోగతికి సహకరించాలని డిమాండ్ చేశాడు. మన ఊరు మన బాధ్యత అంటూ మన హక్కుల కోసం పోరాడుదాం, పోరాడి సాధించుకుందాం... మీరంతా తరలిరండి అంటూ యువతరానికి పిలుపునిచ్చాడు. జైఆంధ్ర జైజై ఆంధ్ర అంటూ నినదిద్దాం, యువచైతన్య దీపాల్ని వెలిగిద్దాం అంటూ యువతను ఉత్తేజపరుస్తూ తన దీక్షని కొనసాగించాడు. సుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, కార్పొరేటర్ నూనె మల్లిఖార్జున యాదవ్, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజ గోపాల్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మూలం రమేష్, జనసేన నాయకులు చెన్నారెడ్డి మనుక్రాంత్, కొట్టే వెంకటేశ్వర్లు, మురళీరెడ్డి తదితరులు దీక్షా శిబిరానికి వచ్చి చందుకు తమ సంఘీభావం తెలిపారు.

గాంధీ మహాత్ముని సాక్షిగా జరిగిన ఈ ఒక్కరోజు దీక్షలో సేవాసమితి సభ్యులు మాగుంట శివరామిరెడ్డి, కమతం అశోక్, లేఖిన్‌రెడ్డి, నూనె రిషియాదవ్, ఆరుగుంట రమేష్‌రెడ్డి, సాయిబాబా, సాయికృష్ణ, మందా బాబు తదితరులు పాల్గొన్నారు.



### శరత్‌కి వలవేస్తున్న పార్టీలు..

శరత్‌చంద్రారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల యువత చూపిస్తున్న ఆసక్తిని ప్రజల్లో యంయస్ఆర్ సేవాసమితికి వస్తున్న ఆదరణని అన్ని రాజకీయపార్టీలు అధ్యయనం చేస్తున్నాయి. ముఖ్యంగా జనసేన, టిడిపిలైతే నేరుగా ఆయనకు ఆహ్వానం పలికాయి.

### తండ్రిని దింపాలనే ఆలోచనలో తనయుడు..



శరత్‌చంద్రారెడ్డి మాత్రం తన తండ్రి మాగుంట వెంకటనారాయణ రెడ్డిని బరిలోకి దింపాలని యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ దశలో ఇప్పటికే ఓ రాజకీయపార్టీ వెంకట నారాయణరెడ్డిని తన పార్టీ అభ్యర్థిగా ఏదో ఒక చోట నుండి బరిలో దింపాలనే బలమైన ఆలోచనతో వున్నట్లు తెలుస్తోంది. మాగుంట వెంకటనారాయణరెడ్డికి అన్ని రాజకీయపార్టీల నాయకులతోనూ, వర్గాలతోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. 3దశాబ్దాలకు పైగా నెల్లూరులో మంచి పలుకుబడి కలిగిన వ్యక్తిగా ఆయనకు పేరుంది. ఈ క్రమంలో తన తండ్రిని రాజకీయ నేతగా చూడాలన్నది శరత్‌చంద్రారెడ్డి అభిమతమని 'శరత్' శిష్యబృందం నుండే అందిన సమాచారం. రాజకీయాలలో ఏ పదవి ఎప్పుడు ఎవరిని వరిస్తుందో చెప్పలేం... చూద్దాం... ఏ పుట్టలో ఏ పాముందో..?

## విపిఆర్‌కు సైతం...

# కోపమొచ్చింది

### • చంద్రబాబును చెడుగుడు ఆడాడు



"అజాతశత్రువే ఆగ్రహించిన నాడు".. అని మహాభారతంలో వుంది. ఎప్పుడూ శాంతి, సహనంతో వుండే వాళ్ళకు ఒక్కసారిగా ఆవేశం వస్తే ఎవరూ తట్టుకోలేరు. పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలో బయటవాళ్లెవరూ ఆగ్రహాన్ని చూసి వుండరు. ఆయనెప్పుడూ ప్రశాంతంగా, ఆగ్రహావేశాలను జయించిన మనిషిలాగానే కనిపిస్తుంటారు. అలాంటి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలోనూ జగన్‌పై హత్యాయత్నం సంఘటన కోపాన్ని తెప్పిం చింది. సంఘటన కంటే కూడా దానిపై ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు స్పందించిన తీరు చూసి వేమిరెడ్డిలో ఆవేశం నషాళానికి అంటింది.

### ఆయన బుద్ధి పగవాడికి కూడా వద్దు..

గత నెల 26వ తేదీన హైదరాబాద్ ఆసుపత్రిలో జగన్‌ను పరామర్శించిన అనంతరం బయటకొచ్చిన ఆయన మీడియా ముందు చంద్రబాబు నీతిబాహ్య వ్యాఖ్యలను చీల్చిచెండాడాడు. చంద్రబాబులో కనీస మానవత్వం లోపించిందని, ఆయన బుద్ధి పగవాడికి కూడా రాకూడదని వేడుకుంటున్నానని అన్నారు. కత్తి దాడిలో గాయపడిన జగన్‌ను మాటవరుసకైనా పరామర్శించని చంద్రబాబును ఆయన నరరూప రాక్షసుడితో అభివర్ణించారు. సానుభూతి కోసం జగన్ డ్రామాలాడుతున్నాడని చంద్రబాబు అనడం, మనిషిగా ఆయన ఎంత దిగజారిపోయాడో చెప్పడానికి సంకేతం. జగన్‌కు కొత్తగా సానుభూతి అవసరం లేదు. రాష్ట్ర ప్రజలే ఆయన వెన్నంటి వున్నారు. అలాంటి డ్రామాలేవన్నా వుంటే మీకే అవసరం. అలిపిరిలో చంద్రబాబుపై మందుపాతర దాడి జరిగినప్పుడు వై.యస్. రాజశేఖరరెడ్డి తిరుపతికొచ్చి నిరసన దీక్ష చేశారు. ఈరోజు ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డిపై హత్యాయత్నం జరిగితే చంద్రబాబు ఒక మనిషిగా స్పందించకపోగా వెకిలి చేష్టలు, వ్యంగపు మాటలతో చరిత్రహీనుడిగా మిగిలిపోయాడని, నీ మనస్తత్వం ఇప్పటికే అంటురోగంలా మీ పార్టీ నాయకులకు కూడా సోకి వాళ్ళు కూడా అలాగే తయారయ్యారని, మీ మనస్తత్వం, మీ నీచ బుద్ధి ఈ భూలోకంలో ఇంకెవరికీ రాకూడదని భగవంతుడిని వేడుకుంటున్నానని వేమిరెడ్డి ఆవేశంగా చెప్పారు. రాష్ట్రానికి పట్టిన దరిద్రపు చీడపురుగుగా ఆయన చంద్రబాబును అభివర్ణించారు. అబద్ధాలు, ఉత్తుత్తి హామీలతో ముఖ్యమంత్రివైన నీకు, రైతు ఋణమాఫీ అని ఒక్క హామీ ఇచ్చివున్నా అధికారం వస్తుందని తెలిసి కూడా ఆ హామీని అమలు చేయడం అసాధ్యం అని తెలిసి నిజాయితీకి కట్టుబడ్డ జగన్‌కు నక్కకు నాగలోకానికి వున్నంత తేడా వుందని విపిఆర్ ఎద్దేవా చేశారు.

మొత్తానికి అజాతశత్రువు ఆగ్రహిస్తే ఎలా వుంటుందో విపిఆర్ వ్యాఖ్యలు వింటేనే అర్ధమౌతోంది.

### • కస్తూరిదేవి విద్యాలయం వివాదం

# దొంగలెవరు.. దొరలెవరు...?

*గత నెల రోజుల నుండీ నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి విద్యాలయ సంస్థని మళ్ళీ వివాదాల్లోకి లాగారు. ఈ సంస్థ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేయాలని ఎవరు వచ్చినా వాళ్ళను రోత పుట్టించే రాతలతో రచ్చకీడుస్తోంది జిల్లాలోని ఓ పాత పేపరు.*

అసలు కస్తూరిదేవి చరిత్ర ఏమిటి? ఈ సంస్థ తొలినాళ్ళలో అంటే 1925లో కస్తూరిదేవి జాతీయ బాలికా పాఠశాల అని ప్రారంభించబడి తరువాత కాలంలో కస్తూరిదేవి విద్యాలయంగా ఎలా రూపాంతరం చెందింది? 2 యకరాలలో వున్న సంస్థని 22యకరాలలోకి మార్చడానికి కారణభూతులెవరు? అసలు ఈ సంస్థ అభివృద్ధి కోసం ఆది నుండి నిరంతరం పాటుపడింది ఎవరు...?

1981లో ఈ సంస్థకు సంబంధించిన 3యకరాల స్థలాన్ని అప్పటి కమిటి సభ్యులుగా వున్న కొందరు ఘరానా దొంగలు లీజు పేరుతో దోచుకోవాలని ప్రయత్నం చేసినప్పుడు వారిని అడ్డుకుంది ఎవరు? ఆ ఘరానా దొంగలకి అండగా నిలిచిన గజదొంగ ఎవరు?

1995 నుండి ఈరోజు వరకు ఈ సంస్థను, సంస్థ ఆస్తులను కాపలాకాసి కాపాడిందెవరు? 2001లో దాదాపు కోటి రూపాయలు ఖర్చు చేసి మల్లెతోటల పేరుతో పరుల ఆధీనంలో వున్న 5యకరాల స్థలాన్ని అక్రమార్కుల కబ్జా నుండి కాపాడింది ఎవరు..? 2007 తరువాత ఈ సంస్థల స్థలాలను బెంగుళూరుకు చెందిన ఓ బడా బిల్డర్‌కు జాయింట్ డెవలప్‌మెంటు కిస్తాం, లేదా ఆస్తులను అమ్మేసి ఊరు బయట మరో వంద యకరాలు కొందాం అని ప్రతి పాదించింది ఎవరు..?

1981 నుండి ఈనాటి వరకు ఈ సంస్థ అభివృద్ధి కోసం నిస్వార్ధంతో పోరాడుతున్నదెవరు? వందలాది కోట్ల రూపాయలు విలువ చేసే సంస్థ ఆస్థులని అన్యాక్రాంతం కాకూడదనే సంకల్పంతో, సంస్థ ఎప్పుడో వ్రాసుకున్న నియమనిబంధనలని తిరిగి వ్రాసుకుని భవిష్యత్‌లో ఈ సంస్థలో ఎలాంటి లీజులాంటి గలీజు వ్యవహారాలుగాని లేదా విక్రయాల లాంటి అక్రమ కార్యకలాపాలు గాని జరగకూడదని నిబద్ధతతో సంస్థ అభివృద్ధికి పాటుపడాలని వచ్చిన కొత్త కమిటీని భ్రష్టుపట్టించే ప్రయత్నం చేస్తున్నదెవరు...?

ఇలాంటి ప్రశ్నలు ఎన్నో సమాధానం లేనివిగా మిగిలిపోయి వున్నాయి. వీటన్నింటికీ సమాధానాలతో పాటు కస్తూరిదేవి పుట్టుపూర్వోత్తరాలతో సహా సంస్థ చరిత్రని పాఠకుల కోసం సిద్ధం చేసింది 'లాయర్'. వచ్చేవారం నుండి వారం వారం మా పాఠకుల ముంగిళ్ళలో వాస్తవాలను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తోంది. గత నెల రోజులుగా ఈ సంస్థలపై జరుగుతున్న విషప్రచారాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదంటూ 'లాయర్'ని వాట్సాప్‌ల ద్వారా ఈ-మెయిళ్ళ ద్వారా, ఫోన్ ద్వారానే కాకుండా నేరుగా సైతం ప్రశ్నించిన, ప్రశ్నిస్తున్న కస్తూరిదేవి అభిమానులు, పూర్వవిద్యార్థినుల అభీష్టంపై పూర్తి వివరాలను, అసలు నిజాలను వచ్చేవారం నుండి అందించబోతోంది.




## 'ప్రభా'తం

# మాయమవుతున్న మానవత్వం

ఈ భూమిపై సకల జీవరాశులలో మనిషీ ఒకడే. పుట్టుక, చావు విషయంలో మిగతా జీవరాశికి మనిషికి పెద్ద తేడా లేదు. కాని, బ్రతికే విషయంలో తేడా చూపించాడు. పశు పక్ష్యాదులకు లేని ఎన్నో గుణాలు మనిషిలో వున్నాయి. మనిషికి తెలివి, దయ, ప్రేమ, అభిమానం, బాధ, త్యాగం... ఈ మంచి లక్షణాలేనా... పశువులు, క్రూరమృగాలలో వుండే చెడు లక్షణాలు కూడా వున్నాయి. ఈ సమాజంలో మానవతా లక్షణాలు చూపించిన వాళ్ళు ఆదర్శమహనీయులుగా, పశుత్వంతో చెలరేగిన వాళ్ళు చెదపురుగులుగా ముద్రపడిపోతుంటారు.

కరెంట్ షాక్ తగిలి ఒక కాకి రోడ్డుమీద పడిపోతే ఒక్క నిమిషంలో వెయ్యి కాకులు గుమికూడిపోతాయి. ఆ చనిపోయిన కాకితో వచ్చిన కాకులకు బంధుత్వం వుండదు, రక్తసంబంధం అంతకన్నా వుండదు. ఈ కాకేమో తన ఆస్తులను మిగతా కాకులకు పంచి వుండదు. అయినా సాటి తమ జాతి జీవి ప్రాణం కోల్పోతే ఆ జాతికి చెందిన మిగతాప్రాణులు పడే బాధను మనుషులు ఈ రోజుకీ అర్థం చేసుకోలేకపోతున్నారు.

ప్రపంచంలో దాదాపు 200 దేశాలున్నాయి. అన్ని దేశాలలో రాజకీయపార్టీలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, ఎన్నికలు, ప్రచారాలు, విమర్శలు వంటివి వున్నాయి. అయితే భారతదేశంలో వున్నంత చెత్త రాజకీయాలు ఏ దేశంలోనూ వుండవేమో! ఇంత దరిద్రపు రాజకీయ వ్యవస్థ ఇంకెక్కడా వుండదేమో! రాజకీయాలలో మానవతా విలువలు కోల్పోయిన నాయకులు పలు సందర్భాలలో తాము మనుషులమన్న సంగతి మరచిపోయి మృగావతారాలెత్తుతున్నారు.

విశాఖపట్నం ఎయిర్‌పోర్టు కేంద్రంగా వైకాపా అధినేత, ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం, అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, ఈ సంఘటనపై అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల ప్రకటనలు మానవతా భావానికి నిలువునా సమాధి కట్టాయని చెప్పవచ్చు. ఏదైనా ప్రమాదం లేదా అపాయం జరిగినప్పుడు పగోడికైనా పరామర్శించే సంప్రదాయం మన పూర్వీకులు మనకు నేర్పించారు. చావుకైనా, పెళ్లికైనా శత్రువు ఇంటికి వెళ్లే సంస్కారాన్ని మనకు అలవాటు చేసారు. అలాంటి గొప్ప సంస్కారాన్ని ఈ రాష్ట్ర నాయకులు కొందరు మరచిపోయారు.

జగన్‌పై హత్యాయత్నం ఒక కోణం. దాని నేపథ్యం వేరు, దానిని చూడాల్సిన దృష్టి కోణం వేరు. మనకు పటిష్టమైన భద్రతా వ్యవస్థలున్నాయి. నిఘా సంస్థలున్నాయి. కాబట్టి నిష్పక్షపాతంగా విచారణ జరిపితే జగన్‌పై దాడి డ్రామానా లేక కుట్ర జరిగిందా? అదీగాకుంటే నిందితుడు పబ్లిసిటీ కోసం చేసాడా? ఏదో ఒకటి తేల్చడం పెద్ద పనేమీ కాదు.

కాని, ఆంధ్రప్రదేశ్‌ను ఏలుతున్న తెలుగుదేశం పెద్దలలో ఆ స్పృహ లోపించింది. జగన్‌పై హత్యాయత్నం జరిగిందని తెలిసాక ఒక రాష్ట్రాన్ని పరిపాలించే ముఖ్యమంత్రి ముందు బాధ్యతాయుత కోణంలో వ్యవహరించాలి. సంఘటన ఎలా జరిగిందనే దానిపై విచారించాలి. ప్రతిపక్ష నేత పరిస్థితి ఎలా వుంది, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలేంటి అనేవి పరిశీలించాలి. వైద్యులతో మాట్లాడాలి. పరామర్శించాలి. తర్వాత దానిని రాజకీయ కోణంలో వాడుకోవచ్చు. లేదా పోలీసుల దర్యాప్తులో అది బూటకం అని ప్రాథమికంగా తేలితే ఇష్టం వచ్చినట్లు ప్రతిపక్షంపై బురద చల్లొచ్చు.

బాధ్యత గల ముఖ్యమంత్రిగా చంద్రబాబు అవన్నీ చేయలేదు. సంఘటన జరిగిన నాలుగు గంటల్లోనే ప్రెస్‌మీట్ పెట్టడం, దాడినొక డ్రామాగా అభివర్ణించడం, దీనిని కేంద్ర ప్రభుత్వంపైకి నెట్టేసే ప్రయత్నం చేయడం, దీనికి మళ్లీ ప్రత్యేకహోదా, ఆపరేషన్ గరుడ అనే పాచిపోయిన పదాలను జత చేయడం, జరిగిన సంఘటన నుండి రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్లించడానికి గంటల కొద్ది సంబంధం లేని విషయాలు మాట్లాడడం... సంఘటన జరిగాక ఒక ముఖ్యమంత్రిగా కాదు, మామూలు మనిషిగాన్నా ఒక గంట మనం వ్యవహరించలేకపోతున్నామంటే... మనుషులుగా మనం ఎంత దిగజారిపోతున్నట్లు? ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? తెలుగుదేశం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఈ విషయంలో చంద్రబాబునే అనుసరించారు. ఒక మంత్రివర్యులు మేం స్కెచ్ వేస్తే పిల్లకాయలను పెట్టి గిల్లడం గిచ్చడం వుండదు... అంతా భారీ స్థాయిలోనే వుంటుందంటే... ఇంకొక ఎంపీ మేం తలచుకుంటే జగన్‌ను కైమా కొట్టుండేవాళ్లం అని వాగడం... ఇంకో ఎమ్మెల్సీ చెత్తవాగుడు పతాక స్థాయికి చేరి రాజకీయ నాయకుల మీదే వెగటుపుట్టేలా చేసింది. పార్టీలో తమను తొక్కేస్తున్నాడని చెప్పి జగన్ హత్యకు ఆయన తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలలే ప్లాన్ చేసారట. ఇలాంటి చెత్తవాగుడు వాగేవాళ్ళు మన ప్రజాప్రతినిధులు.

ఈ ఎమ్మెల్సీ వాదననే తీసుకుందాం. రాజకీయ పదవుల కోసం విజయమ్మ, షర్మిలలు ఆ పని చేస్తే...? మరి 2003లో అలిపిరి వద్ద చంద్రబాబు హత్య కోసం మందు పాతరలు పెట్టించింది ఎవరనుకోవాలి? మనుషులన్నాక కాస్త ఇంగిత జ్ఞానంతో మాట్లాడాలి.

జగన్‌పై దాడి సంఘటనలో అధికార పార్టీ అధినేత పైత్యం ఎంతగా ముదిరిందంటే... మానవీయ కోణంలో జగన్‌ను పరామర్శించిన ఇతర పార్టీల నేతలను తిట్టేంతగా పెరిగిపోయింది. దాడి గురించి తెలియగానే పక్క రాష్ట్ర సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు స్పందించి పరామర్శించారు. రాజకీయ అనుభవం లేని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ, సీపీఎం, సిపిఐ నాయకులు అందరూ పరామర్శించారు. ఒక్క తెలుగుదేశం నాయకులే కనీస సంప్రదాయ విలువలను మరిచారు. జరిగిన దాడిని హేళన చేస్తూ, దీనినొక డ్రామాగా ప్రజల మనసుల్లోకి ఎక్కించే ప్రయత్నం చేసారు.

ఈ దేశంలో రాజకీయ నాయకుల హత్యలు, సహజ మరణాలు సంభవించిన సమయంలోనూ లేదా రాజకీయ నాయకులపై దాడులు జరిగిన సందర్భాలలోనూ రాజకీయాలకతీతంగా నాయకులు పరస్పరం కలుసుకున్న సంఘటనలున్నాయి. ఇందిరాగాంధీ పాడెను ఎన్టీఆర్ మోసాడు. ఎన్టీఆర్ చనిపోయిన రోజున ఆయన భౌతికకాయం వద్దకు ముందుగా కాంగ్రెస్ నాయకులే పరుగులు తీసారు. అలిపిరిలో చంద్రబాబుపై దాడి జరిగిన రోజున ప్రతిపక్ష నేతగా వున్న వై.యస్.రాజశేఖరరెడ్డి తిరుపతిలో నిరసన దీక్ష చేశారు. అంతెందుకు... తమిళ రాజకీయాలలో పిల్లి, ఎలుకల్లాగా పోట్లాడుకున్న కరుణానిధి, జయలలితలు కూడా పలు సందర్భాలలో మానవీయ కోణాన్ని చాటుకున్నారు. జయలలిత చనిపోయినరోజున కరుణానిధి వ్రాసిన కవిత కోట్లాదిమంది ప్రజల గుండెలను పిండేసింది.

రాజకీయాలలో శత్రుత్వం సిద్ధాంతాలకు, ఎన్నికలకు మాత్రమే పరిమితం కావాలి. ఆ శత్రుత్వం వ్యక్తిగతాల్లోకి జొరబడితే మనిషి మానవ లక్షణాలను కోల్పోతాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను అలాంటి జాడ్యమే ఆవహించింది. నాయకులు మనుషులమన్న సంగతి మరచిపోయి మాటల్లో చేతల్లో పరిధిలు దాటి ప్రవర్తిస్తుండడం శోచనీయం.



జగన్‌పై దాడి సంఘటనలో అధికార పార్టీ అధినేత పైత్యం ఎంతగా ముదిరిందంటే... మానవీయ కోణంలో జగన్‌ను పరామర్శించిన ఇతర పార్టీల నేతలను తిట్టేంతగా పెరిగిపోయింది. దాడి గురించి తెలియగానే పక్క రాష్ట్ర సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు స్పందించి పరామర్శించారు. రాజకీయ అనుభవం లేని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ, సీపీఎం, సిపిఐ నాయకులు అందరూ పరామర్శించారు. ఒక్క తెలుగుదేశం నాయకులే కనీస సంప్రదాయ విలువలను మరిచారు.

---

# డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ మైనార్టీ యువతకు ఆర్టీసీ కళాశాల ద్వారా డ్రైవింగ్ లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కార్పొరేషన్ ఇడీ నారాయణ గత నెల 26న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 33ఏళ్ళ లోపు ఉండాలని, ఆసక్తి గల యువత బయోడేటా, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో, బ్యాంక్ పాస్ పుస్తకం, పదవ తరగతి విద్యార్హత సర్టిఫికెట్ ను దర్గామిట్టలోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. శిక్షణ కాలంలో రెండు జతల ఖాకీ యూనీఫారం, ఇన్సూరెన్స్, ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్స్‌లను ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు 98499 01154, 90007 74858 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

---

● వ్యాధి నిరోధక టీకాలు

# పటిష్టంగా అమలు చేస్తారంట

నెల్లూరు జిల్లాలో వ్యాధినిరోధక టీకాలు కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తామని డీయంహెచ్ ఓ వరసుందరం పేర్కొన్నారు. నెల్లూరు డీయంహెచ్ ఓ కార్యాలయంలో గతనెల 27న విస్తరణాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో ఇమ్యూనైజేషన్ నిర్వహణ కోసం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందుకోసం ప్రతీ గ్రామంలో ఇంటింటి సర్వేను చేపట్టాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ స్వర్ణలత, లెప్రసీ, ఎయిడ్స్ విభాగం అదనపు వైద్యాధికారి రమాదేవి, డీఐవో ఉమామహేశ్వరి, ఎస్ ఓ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు

---

జొన్నవాడ ఇన్‌ఛార్జ్ ఇ.ఓగా

# రవీంద్రరెడ్డి

జొన్నవాడలోని మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారి దేవస్థానానికి ఇన్‌ఛార్జ్ ఇ.ఓగా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డిని నియమించారు. ఇక్కడ ఇ.ఓగా వున్న దబ్బుగుంట వెంకటేశ్వర్లును పెంచలకోనకు ఇన్‌ఛార్జ్ ఇ.ఓగా పంపారు.

---




# కాలుష్య కర్మాగారం

నెల్లూరు నగరం కాలుష్య మయంగా మారింది. ముఖ్యంగా వాహనాల కాలుష్యం అధికంగా వుంది. ప్రతి ఇంటికి రెండు మోటారు వాహనాలుంటున్నాయి. మధ్యతరగతి ప్రజలు కూడా కార్లకు తగ్గడం లేదు. ఆటోలైతే వేల సంఖ్యలోనే! ట్రంకురోడ్డు మీద ఒక గంట పాటు వున్నామంటే ఏ స్థాయిలో ప్రమాదకర వాయువులు పీలుస్తున్నామో అర్థం కాని పరిస్థితి. సైకిళ్లు తొక్కేవాళ్ళు లేరు. రిక్షాలు ఎక్కేవాళ్ళు లేరు. మోటారు వాహనాలు పెరగడం వల్ల రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతోంది. దీనికితోడు సిమెంట్‌రోడ్లు... ధుమ్ము, ధూళి... ఈ కాలుష్యం చూస్తుంటే కొద్దిరోజులకు నెల్లూరు కూడా ఢిల్లీలాగా మారుతుందేమోననిపిస్తోంది.

*అనిల్‌సాయి, నెల్లూరు.*

# వెకిలి చేష్టలు

ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం సంఘటనలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు స్పందించిన తీరు వికృతంగా వుంది. దేశ చరిత్రలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత వెకిలిగా వ్యవహరించి వుండడు. ఆయనకంటే కూడా రాజకీయ అనుభవం లేని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎంతో హుందాగా వ్యవహరించాడు. మాటకొస్తే నాది 40ఏళ్ల ఇండస్ట్రీ అని చంద్రబాబు చెప్పుకుని తిరుగుతుంటాడు. ఆయన నలభైఏళ్ళ అనుభవాన్ని మడిచి జేబులో పెట్టుకోవాలి. ఒక సీఎంగా కాదు, ఒక కార్పొరేటర్ స్థాయి నాయకుడిలా కూడా చంద్రబాబు ప్రవర్తించలేకపోయారు.

*చిలపా మాల్యాద్రి, కందుకూరు.*

# న్యాయస్థానాల జోక్యమేంటి!

భారతదేశం సాంప్రదాయాల పుట్ట. చెట్టు, గుట్ట, పుట్ట మట్టి, నీరు, నిప్పు, గాలి... అంతా దైవమే! ఆధ్యాత్మిక భావనలు, ఆచార కట్టుబాట్లు సూత్రీకరించబడ్డాయి. దాని లోతుపాతులు ఎరుగని స్థాయి లేని వ్యక్తులు వాటి వెలకట్టలేరు. న్యాయస్థానాలు తీర్పులు చెప్పలేవు. హిందూ మతం లోతులెరుగని వారు నేల విడిచి సాము చేస్తున్నారు. 5వేల ఏళ్ల చరిత్ర హిందూ సంస్కృతిది. ఈ సంస్కృతిలో ప్రతి కులానికి, ప్రతి వర్గానికి ఎనలేని ప్రాధాన్యత వుంది. ఈ సంస్కృతిలో స్త్రీకి వున్న విలువ అంతింత కాదు. శబరిమలై ఆలయం విషయంలో సుప్రీంకోర్టు వితండ తీర్పునిచ్చింది. కోర్టులు అనవసరంగా హిందువుల ఆచార వ్యవహారాలలో తల దూరుస్తున్నాయి. వీళ్ళు మిగతా మతాల విషయంలో వేలు పెట్టరు. శబరిమల, దీపావళి టపాసుల తీర్పుతో కోర్టులపై హిందువులకు నమ్మకం పోతోంది.

*వాస్తు రామచంద్ర, నెల్లూరు.*

# తగ్గేది లేదంటున్న... కోవూరు కోళ్ళు

## • జోరు పెంచిన పెళ్ళకూరు




కోవూరులో వర్గపోరు తెలుగుదేశం అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారేటట్లుంది. 2014 ఎన్నికలలోనే కోవూరు టిక్కెట్‌ను ఆశించి భంగపడ్డ పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి ఈసారి మాత్రం ఆరునూరైనా కోవూరు నుండి పోటీ చేసేది ఖాయమంటున్నాడు. ఆయన పార్టీ, సింబల్‌పై గ్యారంటీ ఇవ్వడం లేదుగాని, కోవూరు అసెంబ్లీ బ్యాలెట్ పేపర్‌లో మాత్రం తన పేరు ఖాయంగా వుంటుందంటున్నాడు. అంతేకాదు... వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలో తిరగడం కూడా మొదలుపెట్టాడు.

నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టీడీపీని వదిలిపోయాక, కొంతకాలం సోమిరెడ్డి పార్టీని నెట్టుకొచ్చాడు. 2014కు రెండేళ్ళ ముందు నుండి పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి కోవూరు ఇన్‌ఛార్జ్‌గా వుంటూ పార్టీ కేడర్‌ను పట్టుకొచ్చాడు. 2014 ఎన్నికల్లో పెళ్ళకూరు శీనయ్యను కాదని కాంగ్రెస్ నుండి వచ్చిన పోలంరెడ్డి శీనయ్యకు సీటిచ్చారు. కోవూరు ఎమ్మెల్యేగా పోలంరెడ్డి గెలిచాడు. నియోజకవర్గంలో ఆయన తన వర్గాన్ని పెంచుకుంటూ పెళ్ళకూరు వర్గాన్ని తొక్కే ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో కోవూరులో పలుసార్లు విభేదాలు తెరకెక్కాయి. పెళ్ళకూరు వర్గీయులకు పార్టీలో పదవులు లేకుండా చేసారు. ఆయన మనుషులకు ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. ఎమ్మెల్యే పోలంరెడ్డి చర్యలను నిరసిస్తూ కొందరు కోవూరు నాయకులు బహిరంగంగానే పత్రికలకు ఎక్కగా, ఇంకొందరు పార్టీకి రాజీనామా చేసిపోవడం జరిగింది.

అయితే కోవూరు టీడీపీలో ఇప్పటివరకు జరిగింది ఓ ఎత్తు... రేపు జరగబోయేది మరోఎత్తు... ఈసారి సీటు విషయంలోనే పోలంరెడ్డితో పెళ్ళకూరు పోటీపడబోతున్నాడు. ఒకవేళ టీడీపీ సీటు రాకున్నా కోవూరులో దిగడానికి పెళ్ళకూరు సిద్ధమవుతున్నాడంటే... ఆయన రాజకీయ ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించుకున్నట్లుగానే వుంది.

# ఇదేనా సంస్కారం?

## • నల్లపరెడ్డి శీనయ్య నుండి నేర్చుకున్నదిదేనా?



**"మేం స్కెచ్ వేస్తే గిల్లడం, గిచ్చడం వుండదు... మేం ప్లాన్ చేస్తే రాజారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి లెవల్లో వుంటుంది" - సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**

జగన్‌పై హత్యాయత్నం తర్వాత విజయవాడలో జరిగిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి "మేం స్కెచ్ వేస్తే గిల్లడం, గిచ్చడం వుండదు... మేం ప్లాన్ చేస్తే రాజారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి లెవల్లో వుంటుంది"... అని వ్యాఖ్యానించారు...

స్వర్గీయ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి నుండి నేర్చుకున్న సంస్కారం ఇదేనా? మేనమామ స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నుండి నేర్చుకున్న రాజకీయ విలువలు ఇవేనా? మూడున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం నుండి నేర్చుకున్నదిదేనా?

### తానుముక్కలో తానూ ఒకడనిపించాడు

రాజకీయాలలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికంటూ ఇంతకాలం ఒక సంస్కారపంథా వుండేది. ఈరోజు ఆయన కూడా దానిని బొందపెట్టాడు. బజారు స్థాయి విమర్శలు చేసే తెలుగుదేశం తానుముక్కల్లో తానూ ఒకడయ్యాడు.

### పతనమైపోతున్న విలువలు...

జగన్‌పై దాడిని డ్రామా అంటూ చంద్రబాబు వ్యంగ్యంగా వ్యాఖ్యానించడంలో ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. నలభై ఏళ్ళ అనుభవం నెత్తిమీదకొచ్చినంత మాత్రాన మనసు, ఆలోచన కూడా అదే స్థాయిలో పరిణితి చెందివుంటుందని భావించలేం కదా?

మేం తలచుకుంటే జగన్‌ను కైమా కొట్టేవాళ్ళం అన్న కేశినేని నాని మాటలను పట్టించు కోనవసరం లేదు. ఎందుకంటే ఆయన వుండేది విజయవాడ! రాజకీయాలలో విలువలు అన్నవి పతనమై, వ్యాపార అవసరాలు మొదలైన కాలంలో రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి అతడు. ఆయనకు అంతకంటే సంస్కారం ఏడ్చి చావదు.

జగన్‌పై దాడి వెనుక విజయమ్మ, షర్మిలల హస్తముందన్న యలమంచిలి రాజేంద్రప్రసాద్ మాటలను పట్టించుకోనవసరం లేదు. ఎందుకంటే విలువలు, సంస్కారం అన్న వాటికి అర్ధం తెలియని మనిషి అతను. మెదడు, మనసులోనే కాదు, శరీరంలోని ప్రతి అవయవంలోనూ కులతత్వాన్ని నింపుకున్నాడాయన.

### వాళ్ళ నుండి స్ఫూర్తి పొందినదిదేనా?

రాజకీయాలలో విలువలు అంటే ఇలా వుండాలి, సంస్కారం ఇలా ఉట్టిపడాలి అని రాష్ట్రానికే కాదు దేశానికే చూపించిన పుచ్చలపల్లి సుందరయ్య, బెజవాడ గోపాలరెడ్డి, ఏ.సి.సుబ్బారెడ్డి, యం.వెంకయ్యనాయుడు, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వంటి ఉద్ధండులు పుట్టిన గడ్డ మీదే సోమిరెడ్డి పుట్టాడు కదా! ఇక్కడే రాజకీయాలు నేర్చుకున్నాడు కదా... మరి వాళ్ళ నుండి స్ఫూర్తి పొందింది ఇంతేనా?

### గౌరవం మట్టికొట్టుకుపోయింది!

ఇంతకాలం రాష్ట్ర రాజకీయాలలో సోమిరెడ్డిపై ఒక గౌరవ భావం వుండేది. ఆయన ప్రత్యర్థులపై పదునైన విమర్శలు చేసినా, అది సబ్జెక్ట్ పరంగానే వుంటాయని, వ్యక్తిగత విమర్శల జోలికి పోడని, తన ప్రత్యర్థులు తనపై వ్యక్తిగత విమర్శలకు, దూషణ భూషణలకు పాల్పడుతున్నా సహనంగా వుంటాడనే పేరుంది. నిన్న జగన్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలతో ఇంతకాలం సంపాదించుకున్న ఆ పేరు మట్టికొట్టుకుపోయింది.

# ఇక్కడ కాకుంటే అక్కడ...?

***మీరు సీటిచ్చారా ఓకే... లేకుంటే అవతల పార్టీ వాళ్ళు పిలుస్తున్నారు. అక్కడ నుండైనా పోటీ చేస్తాం... చాలామంది నాయకుల మనోగతం ఇది. రాజకీయాలలో ఇప్పుడు ట్రెండ్ మారింది.***

ఒకప్పుడు నాయకులు తమకు అభిమానం వున్న పార్టీలలోనే వుండేవాళ్ళు. గెలిచినా, ఓడినా ఆ పార్టీల జెండాలు వదిలేవాళ్ళు కాదు. కాని, ఇప్పుడు రాజకీయాలలో అలాంటి నాయకులు లేరు... పార్టీల పట్ల అభిమానం అన్నదే వాళ్ళకు తెలియదు. వాళ్ళకు తెలిసిందల్లా రాజకీయాన్ని వ్యాపారంగా, కాంట్రాక్ట్ లావాదేవీగా చూడడమే!

జిల్లాలో ఒక ఎంపి, 10 అసెంబ్లీ సీట్లుంటే, ఇటు అధికార తెలుగుదేశం నుండి కాని ప్రతిపక్ష వైసిపి నుండి కాని ఆ సీట్లు ఆశిస్తున్న వాళ్ళు ఎక్కువగా వున్నారు. నెల్లూరు నగరం సీటు రేస్‌లో మంత్రి నారాయణతో పాటు మేయర్ అజీజ్, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టి.అనూరాధ రేసులో వున్నారు. వీరిలో మిగతా వాళ్ళ సంగతేమోగాని అబ్దుల్ అజీజ్ మాత్రం వచ్చే ఎన్నికల్లో తాను నెల్లూరు నగరం నుండి పోటీ చేసి తీరుతానంటున్నాడు. ఆయన ధైర్యం టీడీపీ టిక్కెట్ రాకుంటే జనసేన అయినా టిక్కెట్ ఇస్తుందని.

వెంకటగిరి వైసిపి టిక్కెట్ ఆశించిన బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేయడం తెలిసిందే! ఆయనను తమ పార్టీలోకి రమ్మని తెలుగుదేశం వాళ్ళు ఆహ్వానిస్తున్నారు. అయితే వెంకటగిరి లేదా ఆత్మకూరు స్థానాలలో టిక్కెట్ ఇస్తేనే ఆ పార్టీలోకి వెళ్లాలనే ఆలోచనలో ఆయనున్నట్లు సమాచారం. మరోపక్క జనసేన నాయకులు కూడా బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిని తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఆశావాదులకు ప్రత్యామ్నాయంగా జనసేన**

అలాగే వచ్చే ఎన్నికల్లో తాను కోవూరు ఎన్నికల బరిలో వుంటానని టీడీపీ నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి ప్రకటించాడు. ఒకవేళ టీడీపీ టిక్కెట్ రాకుంటే ఆయన ఏ పార్టీ నుండి కోవూరు అభ్యర్థిగా వుంటాడు? వైసిపి అభ్యర్థిగా వస్తాడో లేక జనసేనలో చేరుతాడో అనే అనుమానాలూ కలుగుతున్నాయి. అలాగే నెల్లూరు సిటి, ఉదయగిరి, కావలి, వెంకటగిరి, గూడూరులలో సీట్లను ఆశిస్తున్న పలువురు నాయకులు ప్రత్యామ్నాయంగా జనసేనను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో ఒకటికి మూడు పార్టీలున్నాయి. డబ్బు పెట్టుకునే సత్తా వుండాలేగాని టీడీపీ, వైసిపి పార్టీలలో టిక్కెట్లు రాకున్నా జనసేన, కాంగ్రెస్, బీజేపీ వంటి పార్టీలు ఇలాంటి వాళ్ళకు సీట్లిచ్చేందుకు సిద్ధంగా వున్నాయి.




# క్షమాపణతో... విజ్ఞత చాటుకున్నాడు అనిల్



రాజకీయాలలో భావోద్వేగాలు సహజం. అయితే నాయకులకు సహనం కూడా అంతే అవసరం. వారి సహనమే వారి సంస్కారాన్ని తెలియజేస్తుంది. వారి మాట తీరే పదిమందిని ఆకట్టుకునేలా చేస్తుంది. కొన్ని కొన్ని సందర్భాల్లో నాయకులు నోరు జారడం సాధారణం. కొందరు ఆ మాటలను సమర్ధించుకుంటారు. అది మూర్ఖత్వం. కాని కొందరు మొదట ఆవేశంలో ఏదేదో మాట్లాడేసినా తర్వాత తప్పు తెలుసుకుంటారు. అలా మాట్లాడ్డం పొరపాటేనని ఒప్పుకుంటారు. మన్నించమని కోరడం ద్వారా తమ తప్పును సరిదిద్దుకుంటారు. అది విజ్ఞుల లక్షణం. రాజకీయాలలో ఎంతో మంచి భవిష్యత్ వున్న నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ అలాంటి విజ్ఞతనే చాటుకున్నాడు.

విశాఖ ఎయిర్‌పోర్టులో తమ ప్రియతమ నేత వై.యస్.జగన్‌పై హత్యాయత్నం జరిగిన రోజున అనిల్ ఆవేశంతో వూగిపోయాడు. మా నాయకుడికి ఏమన్నా అయ్యిందంటే... ఒక్క టీడీపీ ---- వుండదంటూ మాట్లాడేసాడు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జరిగిన సంఘటనపై ఆవేశం రావడం సహజమే గాని, అలాంటి సమయంలోనే సహనం చూపాలి. అనిల్ ఆరోజు పొరపాటున నోరుజారాడు. జగన్ సంఘటన జరిగాక 29వ తేదీన నెల్లూరొచ్చిన అనిల్ ఆరోజు తాను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు కోరాడు. అయితే జగన్ హత్యాయత్నంపై వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్న కొందరు తెలుగుదేశం నాయకుల తీరు మాత్రం దారుణమని, అలాంటి వారికి మానవత్వం లేదని మీడియాతో మాట్లాడుతూ విమర్శించాడు.

# ఒక్కరికే వండి పోస్తున్నారు!

## కార్పొరేషన్ నిధులపై వైసిపి ఫ్లోర్‌లీడర్ రూప్ ఆవేదన



నెల్లూరు నగరపాలక సంస్థలో నిధులన్నీ ఏకపక్షంగా మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి వర్గీయులకు దోచిపెడుతున్నారని వైసిపి ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అబ్దుల్ అజీజ్‌ను, కమిషనర్ ఆలీం బాషాను కలిసి ఈ విషయమై వినతిపత్రం ఇచ్చారు. నగరంలో ఏ కాంట్రాక్ట్ పని వచ్చినా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అన్న కొడుకైన శ్రీహరిరెడ్డికి కట్టబెడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను వచ్చే మార్చికి పూర్తి చేయాల్సి వుండగా, పనులు అప్పగింతలో 8నెలల గడువు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని, గత ఏడాది కూడా 72కోట్లు సబ్‌ప్లాన్ పనులు మంజూరు కాగా, సమయానికి పనులు చేయలేకపోవడంతో 19కోట్లు మాత్రమే ఖర్చు చేయడం జరిగిందన్నారు. కార్పొరేషన్ నిధులను ఏకపక్షంగా కట్టబెడితే విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయాల్సి వుంటుందని రూప్‌కుమార్ హెచ్చరించాడు.

# నెల్లూరు కబుర్లు

# దీపావళి మోతెక్కేనా?



ఓపక్క సుప్రీం కోర్టేమో దీపావళి నాడు టపాకాయలు ఇన్ని గంటలు మాత్రమే కాల్చాలంటూ ఆంక్షలు విధించింది. ఇంకోపక్క పదినెలలుగా నెల్లూరుజిల్లా ప్రజలను ఉక్కపోతలో ముంచెత్తిన ఎండలు ఇప్పుడిప్పుడే తగ్గి చిరుజల్లులు మొదలవుతున్నాయి. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 7న దీపావళి. ఇప్పటికే జిల్లాలో చిరుజల్లులు మొదలయ్యాయి. మరోపక్క జిఎస్టీ దెబ్బతో టపాకాయల ధరలు ఆకాశచువ్వలకంటే ముందే ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు దీపావళి పండుగను ఎంత వరకు చేసుకుంటారో, అసలు వ్యాపారులకు ఈ దీపావళి ఏ మాత్రం లాభాలు తెస్తుందో చూడాలి!?

## చెస్‌లో 'రత్నం' జోష్



నెల్లూరు జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు చాలెంజర్స్-2018 అండర్ 8 సంవత్సరాల వారికి నెల్లూరు సిపిఆర్ ఫంక్షన్ హాలులో గతనెల 28న జరిగింది. చెస్ క్రీడా పోటీలకు నెల్లూరు వేదాయపాళెం డా. కిషోర్స్ రత్నం హైస్కూలులో 3వ తరగతి చదువుతున్న చక్రధర్ అనే విద్యార్థి అండర్ 8 కేటగిరిలో ప్రథమ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా డా.కిషోర్స్ రత్నం జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు విద్యార్థిని పుష్పగుచ్ఛంతో అభినందించి మాట్లాడుతూ రత్నం విద్యార్థులకు విద్యతో పాటు వివిధ క్రీడలలో కూడా ప్రోత్సాహాన్ని, నైపుణ్యాన్ని అందిస్తున్నామన్నారు. రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణ కిషోర్, వాసంతి కిషోర్ విద్యార్థికి అభినందనలు అందజేశారు. ప్రిన్సిపల్ మణిమాల, మేనేజర్ రఘురాం ఉన్నారు.

## రామకృష్ణ ఫైనల్ టచ్

జిల్లా ఎస్పీగా వుంటూ ఇంటలిజెన్స్‌కు బదిలీ అయిన పి.హెచ్.డి రామకృష్ణ రిలీవ్‌కు ముందు కూడా తన ప్రతాపం చూపారు. టి.పి.గూడూరు ఎస్.ఐ వెంకటేశ్వర్లురెడ్డిని వెంకటాచలం పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేశారు. వీఆర్‌లో వున్న ఎస్.ఐ జి.సుబ్బారావును టి.పి.గూడూరుకు అటాచ్ చేశారు. పోలీసు ట్రైనింగ్ కాలేజీ సి.ఐ నాగేశ్వరమ్మను స్పెషల్ బ్రాంచ్‌కు అటాచ్ చేసారు.

## హెడ్‌లు ఏఎస్ఐలుగా...

జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్‌లలో పనిచేస్తున్న 30మంది కానిస్టేబుళ్ళకు ఏఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజి కె.వి.వి.గోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో వీరికి పోస్టింగ్‌లు కేటాయించనున్నారు.

## పోలీసులు 'హెడ్'లయ్యారు

జిల్లాలో 33మంది కానిస్టేబుళ్ళకు హెడ్‌కానిస్టేబుళ్ళగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 43మంది పోలీసులు హెడ్‌కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకుని ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్నారు. తొలివిడతలో 33మందికి ప్రమోషన్ వచ్చింది. త్వరలో మిగతా 10మందికి ప్రమోషన్ రానుంది.

## సింహపురిలో స్ట్రోక్ సపోర్ట్ గ్రూప్

నెల్లూరులోని సింహపురి సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రిలో సింహపురి స్ట్రోక్ సపోర్ట్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. 29వ తేదీన ప్రపంచ పక్షవాత నివారణ దినోత్సవం సందర్భంగా ఈ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ దీక్షాంతి నారాయణ ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ గ్రూప్ ద్వారా వ్యాధిగ్రస్థులకు అవసరమైన వైద్యసేవలు అందిస్తామని ఆమె తెలిపారు. పక్షవాతం వచ్చిన మూడు, నాలుగు గంటల్లోపే పేషంట్‌ను ఆసుపత్రికి తీసుకొస్తే టిపిఎ అనే ఇంజక్షన్ ద్వారా అతనిని సాధారణ స్థితికి తెచ్చే అవకాశం వుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యూరోసర్జన్ డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న, డాక్టర్ హిమబిందు, డాక్టర్ సాగర్, డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## • వేణుగోపాలస్వామి గుడి
# లక్ష్మీనాథ్ చాన్నాళ్ళకు మళ్ళీ ఛైర్మెనయ్యాడు

నెల్లూరు మూలాపేటలోని సుప్రసిద్ధ సత్యభామ రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం పాలక మండలి ఛైర్మెన్‌గా చాన్నాళ్ళకు మళ్ళీ మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. సోమవారం ఆలయంలో జరిగిన వంశపారంపర్య ధర్మకర్తల మండలి సమావేశంలో ఆయనను ఛైర్మెన్‌గా ఎన్నుకోగా, దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ చైతన్య ఆయన చేత ఛైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. గతంలో ఈ గుడికి మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఛైర్మెన్ వుండేవారు. ఆయన మృతితో కొత్త ఛైర్మెన్‌ను ఎన్నుకోవాల్సి వచ్చింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముందుగా ఆనం వివేకానందరెడ్డి మృతికి, అలాగే ఆలయ ఉద్యోగి సూర్యనారాయణ మృతికి సంతాప సూచికంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, మజ్జిగ చంద్రమౌళి, ఆలయ మేనేజర్ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ శ్రీకాంత్ మల్లినేనికి జాతీయ అవార్డు





నెల్లూరు పొగతోటలో వున్న రిచ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ దంత వైద్య విభాగంలోని దంత వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ మల్లినేనికి ఉత్తమ చిన్న పిల్లల దంతవైద్య నిపుణులుగా యంగ్ పీడోడెంటిస్ట్ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా డా. శ్రీకాంత్ మాట్లాడుతూ భారతదేశంలో సంవత్సరానికి ఒక్కసారి జరిగే ఇండియన్ సొసైటీ ఆఫ్ పీడోడెంటిక్స్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ అనేది దంత వైద్య విభాగంలో దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన సదస్సు అని, ఇండియన్ సొసైటీ ద్వారా భారతదేశం మొత్తంమీద దంత వైద్య విభాగంలో అత్యున్నత సేవలు అందించిన వైద్యులను గుర్తించి వాళ్ళకు ఉత్తమ దంత వైద్య నిపుణుల అవార్డు ఇస్తారన్నారు. గతనెల 26న నాగపూర్‌లో జరిగిన ఇండియన్ పీడోడెంటిక్స్ 2018 సదస్సులో జాతీయ అధ్యక్షులు డా. శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ అవార్డును తీసుకున్నట్లు చెప్పాడు. రిచ్ హాస్పిటల్ అధినేత డా.రవికుమార్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ అవార్డు మన తెలుగు రాష్ట్రాలలో నెల్లూరు జిల్లాలోని రిచ్ లిటిల్‌టీత్‌కు చెందిన డా. శ్రీకాంత్‌కి రావడం అభినందనీయమని, ఈ స్ఫూర్తితో మరెన్నో పరిశోధనలు చేయాలన్నారు. ఈ సందర్భంగా రిచ్ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది డా. శ్రీకాంత్ మల్లినేనికి అభినందనలు తెలియజేసారు.




ప్రథమ వర్ధంతి

మా ఇంటి దీపం

స్వర్గీయ పొత్తూరి నిర్మల గారిని

(W/o. డా॥ పి.మోహన్‌రావు,
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, నెల్లూరుజిల్లా)

ప్రథమ వర్ధంతి సందర్భంగా స్మరించుకుంటూ...

తల్లి : పెంటేల సరోజనమ్మ

కుమారులు - కోడళ్ళు:
పొత్తూరి రవిప్రసాద్ - ఆశ్రిత
పొత్తూరి రామప్రసాద్ - దీప్తి

మనుమరాలు : పొత్తూరి అక్షర సాయిమీనాక్షి

తమ్ముళ్ళు - మరదళ్ళు:
పెంటేల రమేష్‌బాబు - అనంతలక్ష్మి
పెంటేల శ్రీనివాసరావు - ఆదిలక్ష్మి

మరిది - చెల్లెలు:
సోమిశెట్టి సత్యనారాయణ - సుజాత

సంవత్సరీకం: తేది. 10.11.2018 శనివారం ఉదయం నెల్లూరు టెక్కెమిట్టలోని 107, నలంద అపార్ట్‌మెంట్స్‌లో జరుగును. కావున తెలియజేయడమైనది.



## జంట మంత్రుల...

# సంయుక్త శంకుస్థాపన

- **2019 నూతన సంవత్సర కానుకగా నెల్లూరుకు నెక్లెస్‌రోడ్డు ఇస్తారట**

ఎలక్షన్‌లు దగ్గరకొస్తుండే సరికేమో జిల్లా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణలిద్దరూ దగ్గర దగ్గరగా వుంటున్నారు. కలిసి కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. కలిసే పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. 27వ తేదీన నెల్లూరు స్వర్ణాల చెరువు వద్ద 20కోట్లతో నిర్మించనున్న నెక్లెస్‌రోడ్డు పనులకు మంత్రులు సోమిరెడ్డి, నారాయణలు సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రులిద్దరు కూడా తమ ప్రసంగాలలో నెల్లూరు నగరం అందమైన బృందావనంలా మారబోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య, మేయర్ అబ్దుల్ అజీజ్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, మాజీఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, ధర్మవరం సుబ్బారావు, ఖాజావలి పాల్గొన్నారు.

# కావలికి కేంద్రీయ విద్యాలయం కావాలి

- **జిల్లా అభివృద్ధి పనులపై కేంద్రమంత్రులను కలిసిన ఎంపి విపిఆర్**



ప్రకాష్‌జవదేకర్‌తో వేమిరెడ్డి



అరుణ్‌జైట్లీకి వినతిపత్రం అందజేస్తున్న వేమిరెడ్డి

అక్టోబర్31వ తేదీన రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖామంత్రి ప్రకాష్‌జవదేకర్‌ను కలిశారు. కావలి ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై ఆయన కేంద్రమంత్రితో చర్చించారు. కావలి చుట్టుపక్కల ప్రాంతాలు విద్యాపరంగా ఎంతో వెనుకబడివున్నాయని, ఇక్కడ పిల్లల విద్యాభివృద్ధికై కావలి సమీపంలోని రుద్రకోట వద్ద కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. రుద్రకోట వద్ద విద్యాలయానికి అవసరమైన 10ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలను కూడా అధికారులకు సమర్పించడం జరిగిందన్నారు. కేంద్రీయ విద్యాలయ తాత్కాలిక వసతికై కావలి జడ్పీ హైస్కూల్‌లో తరగతి గదులను కూడా సూచించడం జరిగిందని విపిఆర్ చెప్పగా, వీలైనంత త్వరలో కావలిలో కేంద్రీయ విద్యాలయం మంజూరు చేస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

## ఆదర్శగ్రామంలో బ్యాంకు ఏర్పాటు చేయండి అంటూ అరుణ్‌జైట్లీని కలిశాడు

రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అక్టోబర్ 29వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని ఢిల్లీలోని నార్త్‌బ్లాక్‌లో కలిసారు. ఆదర్శగ్రామమైన నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో బ్యాంకు ఏర్పాటుపై చర్చించారు. పల్లెపాడు గ్రామాన్ని సంసాద్ ఆదర్శ గ్రామయోజన క్రింద దత్తత తీసుకున్నానని, ఈ ఒక్క గ్రామంలో 3500మంది జనాభా వున్నారని, చుట్టుపక్కల నిడిముసలి, ముదివర్తిపాలెం, కోడూరుపాడు, కుడితిపాలెం వంటి గ్రామాలతో కలిపి 20వేల మంది జనాభా వున్నారని, ఈ గ్రామాల్లో ఎక్కడా బ్యాంకు సౌకర్యం లేదని, పల్లిపాడులో తక్షణం బ్యాంకు ఏర్పాటుకు చొరవచూపాలని ఆయన కేంద్రమంత్రిని కోరారు. 1921 ఫిబ్రవరి 7వ తేదీన మహాత్మా గాంధీ స్వయంగా వచ్చి ఈ గ్రామంలో ఆశ్రమాన్ని ప్రారంభించారని, దక్షిణ భారత దేశంలో ఇదే ఏకైక గాంధీ ఆశ్రమమని ఆయన పేర్కొన్నారు. ఇంతటి విశిష్టమైన గ్రామంలో బ్యాంకులను ఏర్పాటు చేయాలని ఎంపి విపిఆర్ కోరగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అందుకు సానుకూలంగా స్పందించారు.

# ఉత్సాహంగా మారథాన్

- **రన్ రాజా రన్**




నెల్లూరు రన్నర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28వ తేదీన నెల్లూరులో నిర్వహించిన హాఫ్ మారథాన్ రన్ ఎంతో ఉత్సాహ వాతావరణంలో జరిగింది. ఆరోజు ఉదయం ఏ.సి.సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణం నుండి 21కె, 10కె, 5కె రన్‌లు నిర్వహించారు. దాదాపు 3వేల మందికి పైగా యువతీయువకులే కాకుండా నడివయస్కులు, వృద్ధులు, పిల్లలు కూడా ఈ మారథాన్‌లో ఎంతో హుషారుగా పాల్గొనడం విశేషం. నగర డిఎస్పీ ఎంబిఎన్ మురళీకృష్ణ, ట్రాఫిక్ డిఎస్పీ మల్లిఖార్జున్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ వి.నారాయణరెడ్డి, కృష్ణపట్నం పోర్టు పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్, అపోలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్రీరాం సతీష్, దొడ్ల డెయిరీ ప్రతినిధి నవీన్, అరబిందో ఫార్మశీ ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి, నెల్లూరు రన్నర్స్ ట్రస్ట్ ప్రతినిధులు శిల్పారెడ్డి, సుధాకేశవరాజులు మారథాన్ రన్ ప్రారంభోత్సవాలలోను, విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.



# ఆ ఇళ్ళు గుళ్ళులాంటివే!

**- ఆదాల**

ఎన్టీఆర్ ఇళ్ళు పేదలకు గుళ్ళతో సమానమని, ప్రతి పేదవాడికి ఇల్లు వుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 29వ తేదీన ఆయన మేయర్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి కల్లూరుపల్లి వద్ద నిర్మిస్తున్న టిడ్కోవారి గృహ సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. వెంకటేశ్వరపురంలో 4,800 ఇళ్ళు, అల్లీపురంలో 12వేల ఇళ్ళు, అక్కచెరువుపాడులో 3,600 ఇళ్ళు నిర్మాణ దశలో వున్నాయని, వీటిని డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేస్తామని, కల్లూరిపల్లిలో 3,200ఇళ్ళు పునాది దశలో వున్నాయని, వీటిని వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 45వేల ఇళ్ళు లక్ష్యంగా పెట్టుకోగా 25వేల ఇళ్ల నిర్మాణ దశకు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టీడీపీ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, కార్పొరేటర్లు రాజానాయుడు, ఎం.వెంకయ్య, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అదంతా సింపతీ సినిమా!

**జగన్‌పై దాడిని తక్కువచేసి మాట్లాడిన బీద రవిచంద్ర**



విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రతిపక్ష నేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని సానుభూతి నాటకంగా అభివర్ణించాడు తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర. 29వ తేదీన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశం పెట్టారు. జగన్‌పై హత్యాయత్నాన్ని ఒక డ్రామాగా కొట్టివేశారు. రాష్ట్రంలో జగన్ 3వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసాడు. మా పరిధిలో ఎక్కడా ఆయనకు ఏమీ జరగలేదు. కేంద్ర పరిధిలో వుండే ఎయిర్‌పోర్టులోనే ఆయనపై దాడి జరిగింది. ఇదంతా వారి సెల్ఫ్ ప్లాన్. దర్యాప్తు జరిపితే వారి కుట్రలు బయట పడుతాయన్న ఉద్దేశ్యంతోనే జగన్ దర్యాప్తుకు సహకరించడం లేదు. జగన్‌పై దాడి విషయంలో కేసీఆర్, ఏపి బీజేపీ నాయకులు స్పందించిన తీరు చూస్తుంటే వాళ్ళ రహస్య స్నేహం అర్థమవుతుంది. ఎన్డీఏ నుండి తెలుగుదేశం బయటకు రావడాన్ని తట్టుకోలేక బీజేపీ వాళ్ళు ఆంధ్రప్రదేశ్‌ను అస్థిరపరిచేందుకు రకరకాల కుయుక్తులు పన్నుతున్నారని బీద ఆరోపించాడు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ఎస్పీ బంగ్లాలో సైబర్ అనాలసిస్ వింగ్



ఈమధ్యకాలంలో సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయి. ఇంటర్నెట్, ఫేస్‌బుక్, వాట్సాప్‌ల వంటి సోషల్ మీడియా మార్గాల ద్వారా మోసం చేసేవాళ్ళు, మోసపోయేవాళ్ళు ఎక్కువయ్యారు. ఈ సైబర్ క్రైమ్‌లను నిరోధించేందుకు నెల్లూరులోని ఎస్పీ బంగ్లాలోనే సైబర్ అనాలసిస్ వింగ్‌ను ఏర్పాటు చేశారు. దీనిని గతనెల 27వ తేదీ ఆరోజుకు ఎస్పీగా విధులలో వున్న పిహెచ్‌డి రామకృష్ణ ప్రారంభించారు. ఏఎస్పీ పరమేశ్వరరెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక ఎస్.ఐతో పాటు సిబ్బందిని కూడా ఈ వింగ్‌కు కేటాయించారు.



## 'డ్వామా' కాదు...
# అది అక్రమాల చిరునామా!

- జడ్పీ స్టాండింగ్‌కమిటీ సమావేశంలో మండిపడ్డ సభ్యులు
- అధికారులు ప్రజలకు అండగా ఉండాలన్న జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి

అధికారులు ప్రజలకు అండగా ఉంటూ, ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అన్నారు. నెల్లూరులోని నూతన జడ్పీ కార్యాలయంలో గతనెల 30న స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశంలో కలువాయి జడ్పీటిసి సభ్యుడు, వైఎస్సార్సీపి నాయకుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ డ్వామా ద్వారా జరిగే పనులు అవినీతిమయమని ఆరోపించారు. డ్వామా నిధుల ద్వారా అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ కింద ఎంత నిధులు కేటాయించారు?..ఎన్ని మొక్కలు నాటారు?..అందులో ఒక్క మొక్కైనా బతికిందా?.. లెక్కలు చూపాలంటూ నిలదీశారు. దుత్తలూరు జడ్పీటిసి సభ్యుడు మల్లికార్జున మాట్లాడుతూ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో దుత్తలూరు మండలంలో నిర్మించిన ఫైబర్‌డ్యామ్‌లకు 10లక్షల వంతున ఆ శాఖలో బిల్లులు పొందారని, మళ్లీ అవే పనులకు డ్వామా అధికారులు నిధులు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో ఎవరికెంత ముట్టిందో చెప్పాలని నిలదీశారు. దీనిపై సరైన సమాధానం చెప్పకుంటే తాను ఇక్కడే నిరసన చేపడతానన్నారు. జడ్పీ ఛైర్మెన్ జోక్యం చేసుకుని అందుకు అధికారులతో సమాధానం చెప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. వెంకటాచలం జడ్పీటిసి సభ్యుడు, వైఎస్సార్సీపి నాయకుడు వెంకటశేషయ్య మాట్లాడుతూ తమ మండలంలో ప్రజలకు తాగునీరు సాగునీరు సక్రమంగా అందక ప్రజలెంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కసుమూరు చెరువులో ప్యాచ్ వర్క్ పనులు గత అయిదేళ్లుగా చేస్తామంటూనే ఉన్నారు తప్ప ఒక్క పనికూడా జరగలేదన్నారు. నీటిపారుదల అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజలకు వెంటనే తాగునీరు, సాగునీటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ పొట్టేళ్ళ శిరీషా మాట్లాడుతూ, అధికారులు పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయాలన్నారు. జడ్పీటిసి సభ్యులు ఇందూరు శ్రీధర్‌రెడ్డి, తడ జడ్పీటిసి శ్రీధర్, వెంకటశేషయ్య పాల్గొన్నారు.



## 'హాస్య కవి వతంస'..ఇంద్రగంటి



నెల్లూరు కవి ఇంద్రగంటి మధుసూదనరావును జమ్మలమడుగులోని గడియారం సాహితీ పీఠం వారు 'హాస్య కవి వతంస' బిరుదుతో ఘనంగా సన్మానించారు. ఆ సంస్థ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల హాస్యకవితల పోటీలను నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాక, తమిళనాడు, కర్నాటక కవులు కూడా ఈ పోటీలకు కవితలను పంపారు. 146 మంది కవితల్లో 20 కవితలు ఉత్తమంగా ఎంపిక కాగా, వాటిలో ఇంద్రగంటి కవిత కూడా ఒకటి. ఈ సందర్భంగా జమ్మలమడుగు ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన సభలో ఆ సంస్థ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఆకాశవాణి విశ్రాంత ప్రోగ్రామ్ అధిపతి విజయసారధి తదితరులు ఇంద్రగంటిని సన్మానించి బిరుదును ప్రదానం చేశారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# టిడిపి పేదల ప్రభుత్వం

**- ఎమ్మెల్యే పాశం సునీల్**



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం

పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, టిడిపి పేదల ప్రభుత్వమని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. గతనెల 28న ఆయన గూడూరులోని పార్టీ కార్యాలయంలో 36.99 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధలు పడుతున్నవారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు వైద్యం అందించడానికి ఎంత మొత్తాన్నైనా మంజూరు చేస్తున్నారన్నారు. పేదలకు ఇళ్ళ మంజూరులోనూ చొరవ చూపుతూ మరో 2వేల ఇళ్ళను అదనంగా మంజూరుచేశారని కొనియాడారు. నుడా పరిధిలోని 13 గ్రామాలకు 677 ఇళ్ళు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, నరసింహులు, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డేనియల్ చిల్డ్రన్స్‌హోం చిన్నారులకు దుస్తులు



చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న డాక్టర్ సి.రోహిణి

చిల్లకూరు సమీపంలో ఉన్న డేనియల్ చిల్ట్రన్స్ హోం చిన్నారులకు గతనెల 28న పోచారెడ్డి జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ చిన్నారులు క్రమశిక్షణతో మెలగాలని, బాగా చదువుకోవాలని, సీజనల్ వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆంధ్ర మహిళామండలి ప్రతినిధులు విష్ణువందన, శైలజ, స్నేహలతారెడ్డి, జమునమ్మ, సౌందర్యమ్మతో పాటు వార్డెన్ శాంతారాం పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



నెల్లూరు జిల్లా, కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల ఇన్ఫర్ మేషన్ అసెట్ అనే బహుళ జాతి సంస్థ ప్రాంగణ ఎంపికలను కంపెనీ ప్రతినిధి సంజయ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ సంస్థ అమెరికాలోని న్యూజెర్సీలో ప్రారంభమైందని, భారతదేశంలో హైదరాబాద్, విజయవాడ, ప్రక్క దేశం శ్రీలంకలో కూడా విస్తరించిందన్నారు. ప్రధానంగా డేటా గవర్నెన్స్ పైన పనిచేస్తుందని, గత ఏడాది ఈ కళాశాల నుంచి 5 మంది విద్యార్థులను ఎంపిక చేసామని, వీరు మంచి ప్రతిభను ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ ఎంపికలకు కంప్యూటర్ సైన్స్ నుండి 60మంది విద్యార్థులు హాజరవుతున్నారని, రెండు రౌండ్లలో ఎంపికైన విద్యార్థులకు కంపెనీలో రీసెర్చి, హెచ్‌ఆర్ రౌండ్లు జరుగుతాయన్నారు. కళాశాల సంచాలకులు డా. వి.విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డా. ఎన్ కిసాంధర్, అధ్యాపకులు ఉన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయునికి సన్మానం



గత నెల 30వ తేదీ నెల్లూరులో జరిగిన పిఆర్‌టియు సర్వసభ్య సమావేశంలో ఇటీవల పదవీ విరమణ చేసిన గూడూరు మండలం, వేములపాళెం పాఠశాల ఉపాధ్యాయుడు కె.రామరాజును సన్మానిస్తున్న జిల్లా పిఆర్‌టియు అధ్యక్షుడు డి.వెంకటరాజు, ప్రధానకార్యదర్శి ఎన్.తిరుమలయ్య తదితరులు



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎస్పీ రాంబాబు, డాక్టర్ ఉమ తదితరులు

## దొంగ స్వామీజీలను నమ్మబాకండి

**---------------------- జనవిజ్ఞాన వేదిక**

మూఢనమ్మకాలను వదిలిపెట్టాలని, దొంగస్వామీజీలను నమ్మి మోసపోవద్దని జనవిజ్ఞానవేదిక (జేవివి) నాయకులు అన్నారు. గూడూరులో గతనెల 30న ప్రజానాట్యమండలి కళాకారులతో కలసి జేవివి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన గూడూరు డిఎస్పీ రాంబాబు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో జేవివి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ప్రజలు మూఢనమ్మకాలు వీడాలని, మొక్కలు పెంచుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్లాస్టిక్ వాడవద్దని ఆయన సూచించారు. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు జేవివి చేపట్టిన ఈ కార్యక్రమంలో తమను కూడా భాగస్వామ్యం చేసినందుకు ఆయన వారిని అభినందించారు. ఈ కార్యక్రమలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమ, జేవివి అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, రూరల్ సిఐ అక్కేశ్వరరావు, ఎస్ఐ శేఖర్‌బాబు, మనపాటి రవీంద్ర, నాగరాజు, అశోక్, మహీధర్, బాబి, ఓరేపల్లి బాబు, కిరణ్, ప్రదీప్, విష్ణు, రామ్మోహన్, చెంచునారాయణ, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్ధుల కోసం ఒక రోజు

**--- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు ---**

గూడూరు పట్టణంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గత నెల 28న 'వృద్ధుల కోసం ఒకరోజు' కార్యక్రమం నిర్వహించి వారికి ఆటల పోటీలు పెట్టారు. వృద్ధులకు ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యానికి సూచనలిచ్చారు. అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న డాక్టర్ సి. జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, వృద్ధాప్యం శరీరానికే కానీ మనసుకు కాదని, వృద్ధులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఉత్సాహంగా ఉండవచ్చని అన్నారు. మనసు ఉల్లాసంగా ఉంటే వ్యాధులను దూరంగా ఉండవచ్చన్నారు. పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులిచ్చారు. వృద్ధుడైన కొండూరు గోవిందరాజును సన్మానించారు. డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ పాలూరు మహేంద్రరెడ్డి, డాక్టర్ తనూజ, నిర్వాహకుడు విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

# రక్తచరిత్ర-3కి స్కెచ్ వేసిన సోమిరెడ్డి

శ్రీను గల్పిక

అది ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలు కూడా ఈయన మా దేశ అధ్యక్షుడు అయితే మా బ్రతుకులు ఎంతో బాగుండు అని కోరుకునే హైటెక్‌రత్న, నవ్యాంధ్ర సీఎం చంద్రబాబునాయుడు వుంటున్న విజయవాడ నగరం. ఆ నగరంలో టీడీపీ రాష్ట్ర కార్యాలయం. విజయవాడ ఎంపి కేశినేని నాని, రాష్ట్ర సేద్యం శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిలు ప్రెస్‌మీట్ పెట్టారు. కేశినేని మాట్లాడుతూ జగన్‌పై హత్యాయత్నం చేయించాల్సిన అవసరం మాకేముంది. మేము చేయించాలనుకుంటే ఎయిర్ పోర్టులో చేయిస్తామా... మా కార్యకర్తలు తలచుకుంటే రోడ్డుమీదే క్రైమా కొట్టుండేవాళ్ళు... అని అన్నాడు. వెంటనే 'ఆత్మసాక్షి' విలేకరి లేచి... ఇంతకు ముందు మీరేమన్నా మటన్‌కొట్లో పని చేశారా సార్ అని అడిగాడు. అందుకు నాని... ఇంచుమించు అలాగే అనుకో అని చెప్పాడు. తర్వాత సోమిరెడ్డి మాట్లాడుతూ జగన్ మీద మేం మర్డర్‌ప్లాన్ చేస్తే పిల్లోళ్ల చేతికి పిన్నీసులు, గుండుసూదులు ఇచ్చి పంపిస్తామా... మేం స్కెచ్ వేస్తే... రక్తచరిత్ర, రక్త సింధూరం, రక్తతిలకం, రక్తాభిషేకం, రక్తకన్నీరు, రక్తసిరా సినిమాలన్నింటిని కలిపి ఒకేసారి చూసినట్లుగా వుంటుంది. మర్డర్‌లు చేయాలంటే స్కెచ్ కరెక్ట్‌గా వుండాలి అంటూ స్కెచ్‌పెన్‌ను చెవిలో తిప్పుకుంటూ... స్కెచ్‌లు వేయాలంటే ఒక దావూద్ ఇబ్రహీం, ఒక చోటా షకీల్, ఒక పరిటాల రవి, ఒక మద్దెలచెరువు సూరి... ఒక సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి... అని చెప్పి ప్రెస్ మీట్ ముగించాడు.

★★★★★

అల్లీపురంలోని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇల్లు. సోమిరెడ్డితో పాటు ఆయన కొడుకు రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మంత్రి నారాయణ, టి.అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మోపూరు శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, కోడూరు కమలాకర్‌రెడ్డి, మేకల రామ్మూర్తి, దాసరి రాజేష్ వంటి నాయకులున్నారు. అందరూ డైనింగ్ హాల్‌లో డైనింగ్ టేబుల్ చుట్టూ కుర్చీలలో కూర్చున్నారు. డైనింగ్ టేబుల్ మీద వైట్ చార్ట్‌బోర్డు పరచివుంది. మంత్రి నారాయణ వుండి... ఇక స్కెచ్ మొదలుపెట్టండి అని సోమిరెడ్డిని అడిగాడు. స్కెచ్ వేయాలంటే ముందుగా స్కెచ్‌పెన్ కావాలని సోమిరెడ్డి అడిగాడు. వెంటనే సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి ఇంట్లోకి వెళ్లి స్కెచ్‌పెన్‌ల ప్యాకెట్ తెచ్చి తన తండ్రికిచ్చాడు. ఆయన ఆ ప్యాకెట్‌లో నుండి బ్లాక్ స్కెచ్ తీసి గీయబోయాడు. అప్పుడు తాళ్ళపాక అనూరాధ బిగ్గరగా 'ఆపండి' అని అరిచింది. శుభమా అని ఆయన స్కెచ్ వేయబోతుంటే ఎందుకమ్మా అరిచావ్ అని కోటంరెడ్డి శీనయ్య అడిగాడు. శుభమా అంటూ స్కెచ్ వేయబోతున్నాడు కాబట్టే ఆపమని అరిచాను. శుభానికి బ్లాక్‌స్కెచ్ మంచిది కాదు, పసుపు రంగు స్కెచ్ తీసుకోండి... శుభానికి శుభం, మన పార్టీ రంగు కూడా కలిసొస్తుంది అని చెప్పింది. వైట్‌బోర్డ్ మీద పసుపు స్కెచ్ కనిపించదుకదమ్మా అని బీద రవిచంద్ర తన ధర్మసందేహం వెలిబుచ్చాడు. అప్పుడు డాక్టర్ జడ్‌యస్... వైట్ బోర్డు బదులు బ్లాక్‌బోర్డ్ మీద ఎల్లో స్కెచ్ పెన్‌తో స్కెచ్ వేస్తే సరి అని చెప్పాడు. సూపర్ ఐడియా అంటూ అందరూ చప్పట్లు కొట్టారు. అప్పటికప్పుడు బ్లాక్‌చార్ట్ పేపర్ తెచ్చి టేబుల్ మీద పెట్టారు. సోమిరెడ్డి పసుపు స్కెచ్ తీసుకుని... మీకు ముందుగానే చెబుతున్నాను, రక్తం కళ్ళ చూస్తే కళ్ళు తిరిగి పడిపోయేవాళ్ళుంటే ఆ ఆపరేషన్ నుండి ముందుగానే తప్పుకోండని చెప్పాడు. జడ్.యస్. వుండి... నేను రోజూ వందలమంది రక్తం కళ్ళచూస్తుంటాను, నాకేం ఇబ్బంది లేదన్నాడు. మిగతావాళ్ళు కూడా మేము బ్లడ్ క్యాంపుల్లో పాల్గొంటుంటామని, మటన్, చికెన్ కొట్లకు వెళుతుంటామని, సమస్య లేదని ధైర్యంగా చెప్పారు. దాంతో సోమిరెడ్డి స్కెచ్‌కు శ్రీకారం చుట్టి... ఇది హైవే నుండి అల్లీపురంకు దిగే డొంక రోడ్డు... ఇక్కడ నారాయణ, డాక్టర్ జడ్‌యస్‌తో పాటు మరో నలుగురుంటారు. జస్ట్ ఇక్కడ మర్డర్ మిస్ అయ్యిందే అనుకోండి... ఇదిగో ఇది సౌత్‌రాజుపాలెం, అల్లీపురం సెంటర్ పాయింట్. ఇక్కడ బీద రవిచంద్ర, కోటంరెడ్డి శీనయ్య మరో ఆరుమంది వుంటారు... టైం బాగలేక ఇక్కడ కూడా తప్పించుకుందే అనుకోండి... ఇదిగో ఇది స్టోన్‌హౌస్‌పేట వైపు నుండి వచ్చే మూలరోడ్డు... ఇక్కడ ఈసారి పన్నెండుమంది వుంటారు, ఈ టీంకు కిలారి వెంకటస్వామినాయుడు, తాళ్ళపాక అనూరాధలు నాయకత్వం వహిస్తారు... ఇక్కడ కూడా ప్లాన్ మిస్సయ్యిందే అనుకోండి... ఇది మన ఇంటి ముందర ప్రాంతం... ఈసారి ఇక్కడ నేను, రాజగోపాలరెడ్డి, మేకల రామ్మూర్తి, దాసరి రాజేష్, పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి... ఇంకో పాతికమంది దాకా వుంటాం... ఇక్కడ తప్పించుకోవడం ఇంపాజిబుల్. ఇదీ స్కెచ్. ఈరోజు శనివారం... రేపు ఉదయం 8గంటల కల్లా ఈ రక్తచరిత్ర-3 అమలైపోవాలి. ఒకరు గట్టిగా మెడ పట్టుకుంటే ఇంకొకరు కత్తితో పీక కోసేయాలి అని చెప్పాడు. అప్పుడు జడ్.యస్. కలుగజేసుకుని సార్, చిన్న చేంజ్ అని అన్నాడు. ఏంటో చెప్పు అని సోమిరెడ్డి అన్నాడు. స్టార్టింగ్ పాయింట్‌లోనే ఇద్దరూ మెడపట్టుకునే వాళ్ళనే వేసారు. కత్తి పట్టుకునే వాళ్ళను వేయలేదు. అక్కడ నా బదులు గాని లేదంటే నారాయణ సార్ బదులు గాని బీద రవిచంద్రనో, కోటంరెడ్డి శీనయ్యనో వేయండి అని కోరాడు. సోమిరెడ్డి వెంటనే ఆ విధంగా మార్చేసి... ఈరోజు శనివారం, రేపు ఆదివారం... ఉదయం 8గంటల కల్లా మన రక్తచరిత్ర ఆపరేషన్ క్లోజ్ కావాలి. అయితేనే ఆ తర్వాత కార్యక్రమానికి వెళ్ళగలం అని చెప్పాడు. ఓకే అంటూ అందరూ లేచారు. ఈ ఆపరేషన్ స్కెచ్‌ను అక్కడే వున్న ఓ వైసిపి కార్యకర్త తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పోస్ట్ చేశాడు. కాకాణి ఈ వీడియోను కేంద్ర హోంశాఖకు, సిబిఐకి, ప్రధాని కార్యాలయానికి పంపి... సోమిరెడ్డి వైసిపి నాయకుల హత్యకు కుట్రపన్నాడని, అతనిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవాలని కోరాడు.

★★★★★

ఆరోజు ఆదివారం... ఉదయం 7గంటలైంది. ఆ టైంకే కేంద్ర పారామిలిటరీ బలగాలు, బ్లాక్ కమెండోలు సివిల్ డ్రెస్‌లలో సోమిరెడ్డి స్కెచ్ వేసిన నాలుగు పాయింట్లలో మోహరించేసారు. వైసిపి నాయకులెవరినీ బయటకు రావొద్దని కేంద్ర ఇంటలిజన్స్ వర్గాలు ముందుగానే హెచ్చరించడంతో వాళ్ళు బయటకు రాలేదు. 7.15గంటల సమయంలో హైవే మలుపు వద్ద తొలిపాయింట్... సార్, జస్ట్ మిస్ ఓవర్‌టూ సెకండ్ పాయింట్ అని జడ్.యస్. వాకీటాకీలో చెప్పాడు. 7.30నిమిషాలకు సెకండ్ పాయింట్‌లో వున్న రవిచంద్ర... చంద్రమోహనన్నా వెంట్రుకవాసిలో తప్పిపోయింది... ఓవర్ టు థర్డ్ పాయింట్ అని చెప్పాడు. ఎవరు మిస్ అవుతున్నారో, ఎలా మిస్ అవుతున్నారో మఫ్టీలో వున్న కేంద్ర భద్రతా దళాలకు అర్థం కావడం లేదు. ఇంతలో 7.45గంటల ప్రాంతంలో థర్డ్ పాయింట్ నుండి తాళ్ళపాక అనూరాధ వైర్‌లెస్ సెట్ మెసేజ్... సారీ సర్... ఇక్కడా మిస్ అని. ఇక ఫైనల్ పాయింట్... సోమిరెడ్డి ఇంటి ముందర ప్రాంతంలో అంతా టెన్షన్ వాతావరణం... మేకల రామ్మూర్తి, దాసరి రాజేష్, ఈదూరు రామ్మోహన్‌రెడ్డిలు వస్తే కాళ్ళు పట్టుకోవడానికి కాసుకుని వుండగా... పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి పెద్దకత్తిని పట్టుకుని రెడీగా వున్నాడు. అందరూ అటెన్షన్‌తో వుండగా... క్షణాలలో ఊహించని సంఘటన జరిగిపోయింది. మేకల రామ్మూర్తి ఎగిరి కాళ్ళను పట్టుకోగా... ఈదూరు రామ్మోహన్‌రెడ్డి మెడను పట్టుకున్నాడు. పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి ఒక్క ఉదుటున 'జై బాహుబలి' అంటూ కత్తితో నరికాడు. అంతే మెడ తెగి ఆ రక్తం సోమిరెడ్డి మీద పడింది. ఆ రక్తం చూసి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి టప్పున కళ్లు తిరిగి క్రిందపడిపోయాడు. వెంటనే రాజగోపాల్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డిలు నీళ్ళు చల్లడంతో ఆయన పైకిలేచాడు. అప్పుడే భద్రతా దళాలు సోమిరెడ్డిని చుట్టుముట్టి ఏ.కె.47లను ఎక్కుపెట్టి... యువార్ అండర్ అరెస్ట్ అని అన్నారు. ఆ హఠాత్ పరిణామానికి సోమిరెడ్డి బిత్తరపోయి... సార్, కోడిని చంపినా కూడా అరెస్ట్ చేస్తారా... అని భయంతో అడిగాడు. కోడా అంటూ ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ క్రిందకు చూసాడు. అక్కడ రక్తపుమడుగులో కోడిపుంజు పడివుంది. ఏంటి ఇదంతా... ఈ వీడియోలో మీరు వేసిన స్కెచ్ ఏమిటి, ఈ సీన్ ఏంటి.. అని సిబిఐ డైరెక్టర్ ఆస్థానా ప్రశ్నించాడు. అప్పుడు సోమిరెడ్డి... సార్, ఈ ఆదివారం మా వాళ్ళందరికీ దోశ, నాటుకోడి పులుసు పెడదామని భీమవరం నుండి పందెంకోడిని తెప్పించి ఇంటి దగ్గర కట్టేసాను. అది నిన్న పొద్దున తప్పించుకుని ఈ చుట్టుపక్కల తిరగసాగింది. ఈరోజు ఎలాగైనా దానిని పట్టుకుని కోసి కూరవండుకోవాలని చెప్పి మా వాళ్ళతో ఈ స్కెచ్ వేసి, ఈరోజు పొద్దున్నే అమలు చేసాను. ఇది నాటుకోడికి వేసిన స్కెచ్ తప్పితే కోడికి కట్టే కత్తితో వేసిన స్కెచ్ కాదు... అని చెప్పుకున్నాడు. కోడిని కోయడానికి 'స్కెచ్' బిల్డప్పా అంటూ కేంద్ర బలగాలు తిరుగుముఖం పట్టాయి.

88వ జయంతి



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు

వ్యవస్థాపకులు

జననం: 08-11-1930 మరణం: 18-01-1995

లాయర్

తెలుగు వారపత్రిక

# గొంతు కోసే ప్రయత్నమే!

(మొదటి పేజీ తరువాయి)

రోజులు గడిచేకొద్దీ జగన్ హత్యాయత్నం వెనుక లెక్కలేనన్ని అనుమానాలు కమ్ముకుంటున్నాయి. అందరి అనుమానపు చూపులు కూడా అధికారపార్టీ వైపే వుంటున్నాయి. ముఖ్యమంత్రి స్థాయిలో వుండి చంద్రబాబు దీనిని డ్రామాగా కొట్టిపడేసినా, డిజిపిగా వున్న ఆర్.పి.ఠాకూర్ సంఘటన జరిగిన గంటలోనే ఎటువంటి విచారణ జరపకుండానే దీనిని పబ్లిసిటీ కోసం చేసాడని చెప్పి సంఘటనను తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేసినా, నిందితుడు జగన్ అభిమాని అని, జగన్‌కు సానుభూతి రావడం కోసమే అలా దాడి చేయించుకున్నాడని అధికారపార్టీ మంత్రులు, అనుకూల మీడియా కోడై కూసినా... ఈ సంఘటన జరిగాక రేకెత్తుతున్న అనుమానాలు, వెలుగులోకి వస్తున్న నిజాలు ఈ క్రైమ్ సీన్ వెనుక ఏదో ఒక కుట్ర కోణం వుందన్న సంకేతాలను అందిస్తున్నాయి.

అక్టోబర్ 25వ తేదీన విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో జగన్‌పై హత్యాయత్నం జరిగింది. పందెంకోళ్ళకు కట్టే కత్తితో దాడి చేయబోయిన నిందితుడు జనుపల్లి శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గాయమైన జగన్‌కు అక్కడే ప్రాథమిక చికిత్స చేసి కుట్లు వేశారు. అనంతరం ఆయన తన ప్రయాణాన్ని ఆపుకోకుండా హైదరాబాద్‌కు వెళ్లి ఆసుపత్రిలో చేరారు. అక్కడ గాయానికి 8 కుట్లు వేశారు. జగన్‌పై దాడి సంఘటన తెలియగానే రాష్ట్రంలోనూ, దేశంలోనూ పలు పార్టీల నాయకులు పరామర్శించారు. తమ సంస్కారాన్ని చాటుకున్నారు. తెలుగుదేశం నాయకులు మాత్రం చంద్రబాబుతో సహా అందరూ కనీస విలువలు మరిచి ఈ దాడి ఒక డ్రామా అంటూ సిగ్గు విడిచి ఎదురుదాడికి పాల్పడ్డారు. రాజకీయ వ్యవస్థపైనే అసహ్యం వేసేలా వ్యవహరించారు.

## అనుభవం నేర్పింది ఇదేనా?

రాజకీయాలలో నాది నలభైఏళ్ళ ఇండస్ట్రీ అని, దేశంలో నేనే సీనియర్‌నని చంద్రబాబు చెప్పుకుంటుంటాడు. ఆయన సీనియార్టీ ఆయనకు ఏం నేర్పిందో జగన్‌పై దాడి అనంతరం జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడిన మాటల్లోనే అర్థమైంది. దేశ చరిత్రలోనే ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి వ్యవహరించనంత దారుణంగా చంద్రబాబు వ్యవహరించాడు. జరిగిన సంఘటనపై ఆయన విచారం వ్యక్తం చేసి ప్రతిపక్షనేతను పరామర్శించడం కనీస సంప్రదాయం. ప్రభుత్వం ఆయనదే! పోలీసు వ్యవస్థ ఆయన చేతిలోనే వుంది. ఆ తర్వాత ఆయన తీరిగ్గా దర్యాప్తు చేయించుకుని అది డ్రామానా, లేక కుట్రపూరితంగా చేసారా అన్నది తేల్చివుండొచ్చు. ఫలితం ఏదొచ్చినా తనకిష్టమైన రీతిలో కథను మలచి వుండొచ్చు. కాని, ఎంతో హుందాగా వ్యవహరించాల్సిన సమయంలో ఆయన తన అనుభవానికి విలువలేకుండా చేసుకున్నాడు.

## నమ్మకం పోవడానికి డిజిపి ప్రకటనే కారణం

రాష్ట్ర పోలీసు విభాగానికి డిజిపి అధిపతి. చిన్నచిన్న నేరాలు జరిగినప్పుడే నిందితులను పట్టుకుంటే, నేరం ఎలా జరిగిందని మీడియా అడిగితే విచారణ జరిపాక వివరాలు వెల్లడిస్తామని ఒక ఎస్.ఐ స్థాయి అధికారే చెబుతాడు. అలాంటిది డిజిపి స్థాయిలో వున్న ఆర్.పి.ఠాకూర్ సంఘటన జరిగిన గంటలోనే దీనిని పబ్లిసిటీ కోసం చేసిన స్టంట్‌గా చెప్పాడు. ఒక డిజిపియే అలా కేసు లోతుల్లోకి పోకముందే కేసును నీరుగారిస్తే ఇక ఏపి పోలీసులపై నమ్మకం ఎలా వస్తుంది. అందుకే వైసిపి నాయకులు ఈ సంఘటనపై థర్డ్ పార్టీ దర్యాప్తు చేయాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి కోరారు.

## పసలేని కథనాలు..

జగన్‌పై హత్యాయత్నం ఘటన నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి పసుపు నేతలే కాదు, పచ్చ ఛానెళ్లు సైతం తెగ ఆపసోపాలు పడ్డాయి. నిందితుడు జగన్ అభిమాని అంటూ కథలు అల్లాయి. జగన్‌కు సానుభూతి పెంచడం కోసమే దాడికి పాల్పడ్డాడంటూ విచిత్ర వార్తలు వినిపించాయి. ఇందుకు సాక్ష్యాలంటూ నకిలీ ఫ్లెక్సీలను సృష్టించాయి. అభిమాని ఎవరైనా తమ అభిమాన నాయకుడిని హత్య చేయాలనుకుంటాడా? ఇంత చిన్న లాజిక్కు కూడా తెలియనంత అజ్ఞానంతో తెలుగుదేశం నాయకులున్నారా? పోనీ నిందితుడు శ్రీనివాస్ జగన్ అభిమానే అనుకుందాం... సంఘటన జరిగిన తర్వాత అతనిని అభిమానిగా చూడాల్నా? నిందితుడిగా చూసి విచారించాల్నా? ముందు బురద చల్లాలనే ప్రయత్నం మాని విచారణ జరిపితే కదా అతను జగన్ అభిమానా లేక చంద్రబాబు అభిమానా అనే విషయం తెలిసేది!

## ఆదమరచివుంటే ప్రాణాపాయమే!

సంఘటన జరిగిన రోజున జగన్ అప్రమత్తంగా తల పక్కకు తిప్పబట్టి మెడపై పడాల్సిన కత్తి పోటు భుజంపై పడింది. నిందితుడి టార్గెట్ ప్రకారం కత్తి వేటు పడుంటే జగన్ ప్రాణానికే ప్రమాదం ఏర్పడి వుండేది. పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లోనూ హత్యా ప్రయత్నంగానే నమోదు చేశారు. దీంతోనే డిజిపి ప్రకటన తుస్‌మని తేలిపోయింది.

## వెలుగుచూస్తున్న అనుమానాలెన్నో!

సంఘటన జరిగాక తెలుగుదేశం నాయకులు భుజాలు తడుము కుంటున్నారు. అభూత కల్పనలు సృష్టిస్తున్నారు. సంస్కారహీనంగా విమర్శలు చేస్తున్నారు. ఈ సంఘటనతో వాళ్ళకు ఏ సంబంధం లేనప్పుడు వాళ్లు ఇంత రాద్ధాంతం చేయడమెందుకు? దాడి పట్ల విచారణ జరిపి హుందాగా వ్యవహరించి వుండొచ్చు కదా!

వాళ్ళు అలా వ్యవహరించలేదు కాబట్టే అనుమానాలన్నీ కూడా వాళ్ల చుట్టే తిరుగుతున్నాయి. ఆ అనుమానాలు ఎలా బలపడుతున్నాయో పరిశీలిద్దాం... నిందితుడు జనుపల్లి శ్రీనివాస్‌ది తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం. కొంతకాలం క్రిందటే జగన్ 63రోజుల పాటు తూర్పుగోదావరి జిల్లాలో పాదయాత్ర చేశారు. ముమ్మిడివరంలోనూ ఆయన పాదయాత్ర సాగింది. జగన్ అభిమాని అయ్యుంటే నిందితుడు ఒక్కరోజైనా పాదయాత్రకు పొయ్యుండాలి. జగన్‌తో సెల్ఫీ ప్రయత్నం చేసుండాలి. పోనీ ఎయిర్‌పోర్ట్‌లో ఉద్యోగం చేస్తున్నందువల్ల నిందితుడు అక్కడకు పోలేకపోయాడనుకుందాం. పాదయాత్ర తూర్పుగోదావరి జిల్లా చివరికొచ్చినప్పటి నుండి మొన్నటి దాకా కూడా జగన్ విశాఖ ఎయిర్‌పోర్టు ద్వారానే హైదరాబాద్‌కు రాకపోకలు సాగించాడు. దాదాపు 20సార్లు వరకు ఆయన విశాఖ ఎయిర్‌పోర్టులోకి వచ్చివుంటాడు. ఎయిర్‌పోర్టు క్యాంటీన్‌లోనే శ్రీనివాస్ పని చేసేది. మరి జగన్ అభిమాని అయ్యుంటే శ్రీనివాస్ ఒక్కసారన్నా జగన్‌తో సెల్ఫీకి ప్రయత్నించి వుండాలి కదా! అదేమీ లేదే!

## కుట్ర దాగుందా?

జనుపల్లి శ్రీనివాస్ అనే యువకుడికి జగన్‌ను హత్య చేసేంత అవసరం ఏమొచ్చింది. జగన్ మూలంగా అతని కుటుంబానికేమన్నా అన్యాయం జరిగిందా? వాళ్లిద్దరి మధ్య పాత కక్షలేమన్నా వున్నాయా? అలాంటివేమీ లేవు. ఎవరి ప్రోద్బలం, ఎవరి సహకారం, ఎవరి హామీలు లేకుండా శ్రీనివాస్ ఈ దాడికి పాల్పడే అవకాశం లేదు. ఎందుకంటే నేరచరిత్ర వున్న అతను ఎన్‌ఓసి తీసుకుని ఎయిర్‌పోర్టు క్యాంటీన్‌లో ఉద్యోగంలో చేరాడన్నా, అత్యంత భద్రత వుండే ఎయిర్‌పోర్టులోకి కత్తిని తీసుకెళ్ళి దాచిపెట్టగలిగాడన్నా, వెనుక అధికార శక్తి వున్న అదృశ్య శక్తులు నడపనిదే అతను ముందుకు పోలేడు. కాబట్టి నిందితుడి వెనుకవున్న అదృశ్య శక్తులు విచారణలో బయటకు వస్తాయా? రావా? అన్నది చూడాలి.

## కేంద్ర దర్యాప్తు సంస్థతోనే నిజాలు వెలుగులోకి..

ఈ సంఘటనలో నిజాలు బయటకు రావాలంటే కేంద్ర దర్యాప్తు సంస్థల వల్ల మాత్రమే అవుతుంది. రాష్ట్ర పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పని చేయగలిగినా, ఖచ్చితంగా పోలీసులపై ప్రభుత్వం ప్రభావం వుంటుంది. వాళ్ళు కూడా సరైన కోణంలో దర్యాప్తు సాగించడం ఒత్తిడితో కూడుకున్న పనవుతుంది. కాబట్టి కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణ ద్వారా మాత్రమే ఈ కేసులో సస్పెన్స్ వీడుతుంది.



ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న రస్తోగిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

# పిలిస్తే పలుకుతానంటున్న రస్తోగి!

జిల్లా నూతన ఎస్పీగా ఐశ్వర్య రస్తోగి అక్టోబర్ 31వతేదీ ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం రూరల్ అదనపు ఎస్పీగా పని చేస్తూ బదిలీపై ఆయన నెల్లూరుజిల్లాకు ఎస్పీగా రావడం జరిగింది. ఇక్కడ ఎస్పీగా వున్న పిహెచ్‌డి రామకృష్ణను విజయవాడలోని ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ చేయడం జరిగింది. ఐశ్వర్య రస్తోగికి ఎస్పీగా నెల్లూరుజిల్లాలోనే మొదటి పోస్టింగ్. ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న రస్తోగిని ఏఎస్పీ పరమేశ్వరరెడ్డి, అందరు డిఎస్పీలు, సిఐలు, పోలీసు అధికారుల సంఘం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐశ్వర్య రస్తోగి మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుని ప్రజా పోలీసు వ్యవస్థను నెలకొల్పుతామని చెప్పారు. జిల్లాలో ప్రధానంగా వున్న సమస్యలపై అవగాహన తెచ్చుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. క్రికెట్ బెట్టింగ్, ఎర్రచందనం, అక్రమ రవాణా, మైనింగ్ మాఫియా వంటి వాటిని ఉపేక్షించే ప్రశ్నేలేదని, సమర్థవంతంగా నిరోధిస్తామని, ముఖ్యంగా ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టిసారిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ట్రాఫిక్ సమస్యలు, ఆస్తుల నేరాలు, చైన్ స్నాచింగ్స్ ఎక్కువగా వున్నట్లు తెలుస్తోందని, ప్రజలు ఏ సమయంలో అయినా సమస్యను తమ దృష్టికి తీసుకురావచ్చని, ప్రతి సోమవారం డైల్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని, నేరుగా వచ్చి తమ సమస్యలు చెప్పుకోలేని వారు, ఫోన్ ద్వారా తమ సమస్యలు చెప్పుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. పోలీసు శాఖలో సిబ్బంది సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని, పోలీసు శాఖ ద్వారా జిల్లా ప్రజలకు సమర్థవంతమైన సేవలందించేందుకు ప్రయత్నిస్తానని రస్తోగి అన్నారు.

# పన్నులపై పోరాటమే!

**- కోటంరెడ్డి**



పన్నుల రూపంలో ప్రజలను బాదాలని చూస్తే సహించేది లేదని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించాడు. నగరంలో ప్రజలపై మోపిన అధిక పన్నుల భారాన్ని తగ్గించాలని 30వ తేదీ నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి విన్నవించారు. అనంతరం అక్కడే విలేకరులతో ఆయన మాట్లాడుతూ నగరంలో ఇళ్ళ పన్నులను ఇష్టారాజ్యంగా పెంచుతూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ పరిధిలో ఒకేసారి ఇంటి పన్నులను మూడు, నాలుగు రెట్లు పెంచేసారని, ఇళ్ళకు తాఖీదులు ఇస్తూ ప్రజలను భయపెడుతున్నారని, పెంచిన ఇంటి పన్నుల రశీదులతో కార్పొరేషన్ వాళ్ళు మీ ఇళ్ళకు వస్తే పన్నులు కట్టొద్దని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కొద్ది నెలలు ఓపిక పడితే వైసిపి అధికారంలోకి వస్తుందని, పెంచిన ఇంటి పన్నులను ఖచ్చితంగా తగ్గిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పెంచిన ఇంటి పన్నులను తగ్గించకుండా యథావిధిగా వసూలు చేయాలని కార్పొరేషన్ అధికారులు అనుకుంటే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

# కొండల్ హఠాన్మరణం

ఒకప్పుడు కోవూరు శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి నమ్మిన బంటుగా వుంటూ నెల్లూరులో ఎందరికో సుపరిచితుడై ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ రియల్‌ఎస్టేట్ కంపెనీలో పనిచేస్తున్న ముంగర కొండలరావు గతనెల 28వతేదీన హైదరాబాద్‌లోని బృందావన్ హోటల్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన వయస్సు 50 సంవత్సరాలు. నెల్లూరు రంగనాయకులపేటలోని గురుతోటలో కాపురం వుంటున్న కొండలరావు వ్యాపారరీత్యా హైదరాబాద్‌లో వుంటున్నాడు. కొండలరావుకు గతంలోనే హృద్రోగ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆయన మరణవార్త నెల్లూరులోని వారి కుటుంబసభ్యులకు తెలియడంతో ఆయన భార్య సుజాత, తన కూతుర్లు విష్ణువర్ధిని, దివ్యసోనికాలతో కలసి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. అయితే ఈ ప్రయత్నంలో పెద్దకుమార్తె విష్ణువర్ధిని మరణించగా, సుజాత, చిన్నకూతురు సోనికాలు మాత్రం ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు సకాలంలో వచ్చి వీరిని ఆసుపత్రిలో చేర్పడంతో వీరిద్దరైనా ప్రాణాలతో మిగిలారు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో తీవ్రవిషాదం నింపింది.



కుటుంబసభ్యులతో కొండలరావు

# సుంకరి ఆళ్వారుదాసు జయంతి

వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు స్వర్గీయ సుంకరి ఆళ్వారుదాసు 88వ జయంతి గతనెల31న నెల్లూరు ఏసీ స్టేడియంలో జరిగింది. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ ఆళ్వారుదాసు 1986లో వాకర్స్ అంతర్జాతీయ సంస్థను స్థాపించారని, ఈ ప్రపంచమంతా విస్తరింపజేయడంలో ఆయన విశేషకృషి చేశారన్నారు. అనంతరం వాకర్స్ సభ్యులకు చాక్లెట్లు పంచిపెట్టారు.



అసోసియేషన్ ట్రెజరర్ కొండూరు సుబ్బారావు, ఉపాధ్యక్షులు జివి.కృష్ణయ్య, సాయిసుబ్బారావు, సహాయ కార్య దర్శులు లక్కాకుల శ్రీనివాసులు, పిచ్చయ్య, జాలీ వాకర్ సోను, వాకర్స్ పాల్గొన్నారు.

# ప్రభాకరుడు ఇక సేవాభూషణుడు

- ఘనంగా కళాంజలి రజతోత్సవ వేడుక

ప్రజాసేవలో పదిమందికి స్ఫూర్తినిస్తూ... మంచిని చేయాలనుకునేవారికి ఆదర్శంగా నిలుస్తూ అనతికాలంలోనే అటు సామాజిక సేవారంగంలోనూ ఇటు రాజకీయ రంగంలోనూ తనదైన సేవాపంథాను చాటుకున్న పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సేవాగుణానికి ఓ నూలుపోగులా కళాంజలి సాంస్కృతిక సంస్థ ప్రదానం చేసిన 'సేవాభూషణ్' అవార్డు ప్రదానోత్సవానికి నెల్లూరు టౌన్‌హాలు వేదికయ్యింది. వేమిరెడ్డి అభిమానులకు, ఇన్నేళ్ళూ ఆయన సేవలతో తరించిన ఆత్మీయులు, అభాగ్యులకు అదో వేడుకయ్యింది.






కళాంజలి సాంస్కృతిక సంస్థ 25వ వార్షికోత్సవ పండుగ ఈ నెల 1వ తేదీన నెల్లూరు పురమందిరంలో వేలాదిమంది కళాప్రియులు, వివిధ సంఘాల ప్రముఖుల మధ్య ఘనంగా జరిగింది. భారతీయ సినిమా గాయకులు డాక్టర్ యస్.పి.బాలసుబ్రహ్మణ్యంతో పాటు ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వీరిశెట్టి హజరత్‌బాబు, తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులు ప్రభాకర్‌రెడ్డిని 'సేవాభూషణ్' అవార్డుతో సత్కరించి సేవకు పట్టాభిషేకం చేశారు. నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సభా కార్యక్రమానికి ముందే హాజరై వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి తన అభినందనలు తెలిపి వెళ్ళారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంధ సంస్థల ద్వారా అనాధలకు, అభాగ్యులకు సేవలందిస్తున్న సేవామూర్తులు సామంతు గోపాలరెడ్డి (వాత్సల్య), యనమంద్ర నాగదేవీప్రసాద్(కళాసేవ), కొండా వెంకట స్వామి(సామాజిక సేవ), పోరెడ్డి పెంచలరెడ్డి (విశ్వభారతి అంధుల పాఠశాల), సుధాకర్(శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధుల ఆశ్రమం), జయాఫిలిప్స్(సుశాంతి వృద్ధాశ్రమం, ఆమంచర్ల), సుశీలమ్మ(ప్రగతి ఛారిటీస్)లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందు 'పాడుతా తీయగా' గాయనీ గాయకులచే 'స్వరఝరి' కార్యక్రమం అందరినీ అలరించింది. కళాంజలి సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు కళాంజలి అనంత్ పర్యవేక్షణలో బెనర్జీ, అరుణ్‌ల వ్యాఖ్యానంతో కార్యక్రమం ఎంతో ఆనందమయంగా జరిగింది.

## ప్రభాకర్‌రెడ్డిగారికి 'పద్మ' అవార్డు వస్తే.. అది ఆ అవార్డుకే గౌరవం

**- ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం**



తన సామాజిక ఆధ్యాత్మిక సేవలతో సమాజానికి విశిష్టమైన సేవలందిస్తూ, అనాధలను ఆదరిస్తూ, ఎంతోమంది పేదలకు విద్య, వైద్యం అందిస్తూ సేవే ధ్యాసగా.. సేవే శ్వాసగా జీవిస్తున్న ప్రముఖదాత, రాజ్యసభ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారికి 'పద్మ' అవార్డు వస్తే... అది ఆ అవార్డుకే గౌరవమని విఖ్యాత సినీ గాయకులు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. దైవం మానుషరూపేణా అన్నట్లుగా సాటి మానవులకు మానవతా దృక్పథంతో సాటిలేని సేవలందిస్తున్న వేమిరెడ్డికి సేవాభూషణ్ బిరుదు ప్రదానం చేయడం ఎంతో అభినందనీయమని, ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. సాధారణంగా వేమిరెడ్డిగారు పెద్దగా ప్రసంగాలు చేయడం తాను చూడలేదని, అయితే ఈ కార్యక్రమంలో ఆయన ఇంత బాగా మాట్లాడడం తానిప్పుడు చూశానని ఆయన అంటూ, తనను సన్మానించే కార్యక్రమంలో తనతో పాటు జిల్లాలోని పలువురు సేవామూర్తులకు కూడా సన్మానం చేయడం తనకెంతో నచ్చిందంటూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన ప్రసంగంలో చెప్పడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమని బాలూ ఈ సందర్భంగా కొనియాడారు. టౌన్‌హాలుతో తనకు చిన్నతనం నుంచి ఎంతో అనుబంధం ఉందని, తాను బాల్యంలో నటునిగా కూడా ఉన్నప్పటి ఆ అనుభవాలను ఆయన జ్ఞాపకం చేసుకున్నారు. ఈ వేదిక ఎంతో పవిత్రమైనదని, చరిత్రాత్మకమైనదన్నారు. తొలుత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఆయన సతీమణి శ్రీమతి ప్రశాంతిరెడ్డి దంపతులను ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించి, కనీవినీ ఎరుగని విధంగా అద్భుతమైన రీతిలో రూపొందించిన ఆరడగుల సన్మానపత్రాన్ని బహుకరించారు.

## ఎంతో సంతోషంగా ఉంది

**- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**



కళాంజలి రజతోత్సవాల్లో తనను సన్మానించడం, సేవాభూషణ్ బిరుదునివ్వడం తనకెంతో సంతోషంగా ఉందని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సమాజానికి తనవంతు సేవలు చేయడమే తన కర్తవ్యమని, అదే తనకు ఆనందాన్నిస్తుందన్నారు. తనతోపాటు కొంత మంది సేవామూర్తులను కూడా ఈ సందర్భంలో సన్మానించడం తనకు బాగా నచ్చిందన్నారు. కళాంజలి సంస్థ నెల్లూరులో గత పాతికేళ్లుగా ఇలా సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ప్రత్యేకించి ప్రభు(తుంగా శివప్రభాత్‌రెడ్డి) తన పట్ల ఇంత అభిమానంతో ఈ కార్యక్రమం నిర్వహించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కళాంజలి అనంత్‌కు తదితరులందరికీ తన కృతజ్ఞతలు తెలిపారు.

## ఒక గొప్పవ్యక్తికి..గొప్ప సన్మానం

**- ఎమ్మెల్యే అనిల్**



ఒక గొప్ప మనసున్న గొప్పవ్యక్తికి ఇది గొప్ప సన్మానం. ఎంతోమంది పేదలకు, విద్యార్థులకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందిస్తున్న సేవలు ఎంతో అద్వితీయం. ముఖ్యంగా అనేక గ్రామాల్లో ప్రజలకు మంచినీటి సౌకర్యాలను అందజేయడం మరింత గొప్ప విషయం.. సామాజిక సేవతో పాటు, ఆధ్యాత్మికసేవలో భాగంగా వైభవోత్సవాలు, లక్ష దీపోత్సవాలు ఇలా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో వేమిరెడ్డి సేవలు అమోఘం. ముఖ్యంగా అలాంటి మంచి వ్యక్తి తమ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎన్నిక కావడం మాకు గర్వకారణం. నెల్లూరుజిల్లా ప్రజలందరి ఆశీస్సులు మానవతా హృదయులైన విపిఆర్‌కు ఉన్నాయి. విపిఆర్‌గారు మా పార్టీలో ఉండడం మాకెంతో భరోసా.

## సేవా తపస్వి..వేమిరెడ్డి

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక సేవా తపస్వి. ఆయన సామాజిక ఆధ్యాత్మిక సేవలు అందరికీ గర్వకారణం. ఆయన సేవలను భారతప్రభుత్వం గుర్తించాలి. పద్మభూషణ్ బిరుదునిచ్చి గౌరవించాలి. వేమిరెడ్డి అటు సమాజసేవలోనూ, ఇటు రాజకీయరంగంలోనూ చేస్తున్న సేవలు విశిష్టమైనవి. ఎంత ఎదిగినా ఒదిగివుండే తత్వం ఆయనది. అదేవిధంగా బాలూగారు మనకు గర్వకారణం. కళాంజలి 25 సంవత్సరాలుగా కళారంగానికి చేస్తున్న సేవలు అద్భుతం. ప్రత్యేకంచి లాయర్ ప్రభు ఇలాంటి మంచి కార్యక్రమాలకు స్ఫూర్తి నివ్వడం సంతోషం.






## సేవకు చిరునామా వేమిరెడ్డిగారు

**- తుంగా శివప్రభాత్‌రెడ్డి**



తన సేవలతో సమాజానికి మార్గదర్శకులుగా ఉన్న మహాదాత శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి సేవాభూషణ్ బిరుదును ప్రదానం చేయడం సంతోషంగా ఉంది. తొలినుంచీ వితరణగుణశీలి అయిన వేమిరెడ్డి ఎంతో కాలంగా ప్రజలకు సేవలందిస్తూ ప్రజాసేవ సేవచేసేందుకు రాజకీయవేదిక అవసరం లేదని నిరూపించారు. అయితే రాజ్యసభ సభ్యునిగా ఎన్నిక కావడంతో తన సేవలను ఒక్క నెల్లూరుకే కాక ఇరుగు పొరుగు రాష్ట్రాల్లోనూ, రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా తన సేవలందించే అవకాశం ఆయనకు కలిగింది. వేమిరెడ్డిగారు మంచి రాజకీయవేత్త. పార్లమెంట్‌లో ఉండాల్సిన సమర్ధవంతమైన వ్యక్తి ఆయన. కలకాలం ఆయన పార్లమెంట్‌లో స్థానం సంపాదించుకోవాలన్నదే నా ఆకాంక్ష. విపిఆర్‌గారితో నాకు మంచి స్నేహం ఉండడం, వారి కుటుంబసభ్యునిగా వారి ఆత్మీయతను పొందగలగడం నాకెంతో సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమానికి భారతీయ సినిమా గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారు విచ్చేయడం, కళాంజలి పక్షాన ఎంతో విశిష్టమైన సేవాభూషణ్ బిరుదును ఇంత ఘనంగా వేమిరెడ్డిగారికి ప్రదానం చేయడం సంతోషకరం. భవిష్యత్‌లో విపిఆర్ గారికి 'పద్మభూషణ్' బిరుదు రావాలని, ఈ 'సేవాభూషణ్' బిరుదు అందుకు శ్రీకారం చుట్టాలని మేం ఆకాంక్షిస్తున్నాం.

## ఎంతో ఆనందం


**- వీరిశెట్టి హజరత్‌బాబు**



విపిఆర్‌కు సేవాభూషణ్ బిరుదు ఇవ్వడం నాకెంతో ఆనందంగా ఉంది. అందులోనూ ఈ బిరుదును విఖ్యాత గాయకుడు మన బాలూగారి చేతులమీదుగా ఇవ్వడం ఇంకా ఆనందం. కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు జరగడం సంతోషకరం. పాతికేళ్ళుగా కళాంజలి ఆధ్వర్యంలో జరుగుతున్న ఇలాంటి మంచి కార్యక్రమాలు నెల్లూరు ప్రజలకు ఎంతో ఆనందం కలుగజేస్తున్నాయి.



# ప్రథమ వర్ధంతి



జననం
18.01.1946

మరణం
05.11.2017

స్నేహశీలి, మృధుస్వభావి,
మంచి మనసున్న మహామనిషి, మానవతావాది

## ఆదాల రాఘవరెడ్డి గారు

పరమపదించి తేది. 05.11.2018 నాటికి
ఏడాది పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

భార్య
**ఆదాల అరుణ**
కుమార్తె
**ఆదాల సాయి అపర్ణ**

కుమారుడు - కోడలు
**ఆదాల వంశీకృష్ణ - రచన**
మనుమరాళ్ళు
**సాయి అనిక, సాయి అవని**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com